మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక


ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర    సంపుటి : 08    సంచిక : 260    ఆదివారం    05 - 04 - 2026    పేజీలు: 8    వెల: 4

## సమీక్షా సమావేశం



3లో..





## అమరావతి నిర్మాణ పనులపై ఉన్నత స్థాయి సమీక్ష

- ☐ రాజధానిలో రూ.57,821 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో పూర్తి
- ☐ అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగవంతం
- ☐ నిర్ణీత గడువులోగా మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం ఆదేశం

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశంలో మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పి. నారాయణతో పాటు సీఆర్డీఏ , ఏడీసీ ఉన్నతాధికారులు మరియు రాజధాని నిర్మాణ పనులు చేపడుతున్న వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిది ద్దే లక్ష్యంతో సాగుతున్న పనుల పురోగ తిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా క్షుణ్ణంగా పరి శీలించారు. పనుల్లో జాప్యం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించి నాణ్యతతో పూర్తి చేయాలని

2 లో..



## దేశంలో భారీ పేలుళ్లకు కుట్ర

- ☐ యూపీలో ఉగ్ర ముఠా అరెస్ట్
- ☐ లక్నో, ఘజియాబాద్ రైల్వే స్టేషన్లే లక్ష్యంగా ప్రణాళిక

మన గళం, లక్నో : దేశంలోని పలు కీలక ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నిన ఒక ప్రమాదకర ఉగ్రవాద ముఠాను ఉత్తరప్రదేశ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. లక్నో, ఘజియాబాద్ వంటి రద్దీ ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడమే కాకుండా, పెద్ద ఎత్తున దాడులు చేసేందుకు ఈ ముఠా వ్యూహరచన చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితులను విచారించగా, వీరికి పాకిస్థాన్‌కు చెందిన గూఢచారి సంస్థ ఐఎస్ఐతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. విదేశాల నుంచి భారీగా నిధులు పొందుతున్న

2 లో..

## గ్యాస్ ధరల సెగ



- ☐ సొంత గూటికి బీహార్ వలస కార్మికులు
- ☐ ఆకాశాన్నంటిన వంట గ్యాస్ ధరలు.. బ్లాక్ మార్కెట్ దందా

మన గళం, పాట్నా : దేశవ్యాప్తంగా వంట గ్యాస్ కొరత మరియు విపరీతంగా పెరిగిన ధరల ప్రభావం సామాన్యులపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా ఢిల్లీ, గుజరాత్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న బీహార్ వలస కార్మికులు అక్కడ బతుకు భారమై తిరిగి తమ సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్ల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకోవడంతో పాటు, బహిరంగ మార్కెట్లో గ్యాస్ దొరకక బ్లాక్ మార్కెట్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

2 లో..


## రాయచూర్‌లో నారా లోకేశ్ పర్యటన



- సైనిక్ స్కూల్ ప్రారంభం
- కేంద్ర మంత్రులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న లోకేశ్

మన గళం, రాయచూర్ : కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ. కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌లతో కలిసి పలు అభివృద్ధి మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో

2 లో..



## ఐటీ రంగంలో ఏఐ రీ-స్ట్రక్చరింగ్ ప్రకంపనలు

2 లో..

- ☐ దిగ్గజ సంస్థల్లో కొనసాగుతున్న ఉద్యోగ కోతలు
- ☐ ఒరాకిల్, అమెజాన్, మెటా సంస్థల్లో వేల సంఖ్యలో లేఆఫ్స్ ప్రకటన
- ☐ భారతీయ టెక్ మార్కెట్‌లో 8 శాతం తగ్గిన ఉద్యోగ అవకాశాలు
- ☐ ఏఐ నైపుణ్యం ఉంటేనే భవిష్యత్తు - ఫ్రెషర్లపై పెరుగుతున్న ఒత్తిడి

## 'కాంగ్రెస్'... ...'ప్రగతి రథ సారథి'..'క్రాంతి'

- కార్యసాధకుడు క్రాంతి నాయుడు బోయ
- ముక్కుసూటి తనమే తన 'బలం'...'బలహీనతా'...అదే
- పార్టీ పటిష్టతే తన ధ్యేయం,బలోపేతమే తన లక్ష్యం
- కర్నూలు జిల్లా కాంగ్రెస్ లో అతి 'పి(చి)న్న'...వయస్సు...డిసిసి...అధ్యక్షుడు..తానే



2 లో..

## బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి

- చంద్రబాబు అసమర్థత వల్లే కళంకిత వ్యక్తులకు పదవులు: అంబటి
- టీటీడీ పవిత్రతను కాపాడాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



మన గళం, గుంటూరు : టీటీడీ చైర్మన్ పదవికి బి.ఆర్. నాయుడు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్రమంలో పలు ప్రముఖ ఆలయాల్లో వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బి.ఆర్. నాయుడుపై

2 లో..

# గ్యాస్ ధరల సెగ



ఈ పరిస్థితుల వల్ల వలస కార్మికులు తాము సంపాదించే అరకొర వేతనంతో కనీసం కడుపు నింపుకోలేని స్థితికి చేరుకున్నారు. నగరాల్లో గ్యాస్ ధరల పెరుగుదల వల్ల హోటళ్లలో తిండి ధరలు కూడా అమాంతం పెరిగాయి. గతంలో పది రూపాయలకు లభించే కనీస ఆహారం ఇప్పుడు ముప్పై, నలభై రూపాయలకు చేరడంతో రోజువారీ కూలీలు బెంబేలెత్తుతున్నారు. "సంపాదించే దానికంటే ఖర్చులు రెట్టింపు అయ్యాయి, గ్యాస్ కొనలేక, హోటల్‌లో తినలేక చివరకు బతకలేక మళ్ళీ మా ఊరు బీహార్‌కు రావాల్సి వచ్చింది" అని తిరిగి వచ్చిన ఒక కార్మికుడు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఉపాధి కోసం వెళ్లిన చోట ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురవడంతో వేలాది మంది కార్మికులు రైళ్లు, బస్సుల్లో తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ దుస్థితికి తమ ఓటును అమ్ముకోవడమే ప్రధాన కారణమని ఇప్పుడు కార్మికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఎన్నికల సమయంలో పది వేల రూపాయలకు కక్కుర్తి పడి ఓట్లను అమ్ముకున్న ఫలితమే నేడు అనుభవిస్తున్నామని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. పని చేసే నాయకులను, అభివృద్ధిని కాంక్షించే వారిని ఎన్నుకోకుండా, డబ్బుకు ఆశపడి ఓటు వేయడం వల్ల సామాన్యుల జీవితాలు చితికిపోతున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. నిరక్షరాస్యత మరియు అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి తప్పులు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయని కొందరు మేధావులు ఆవేదన చెందుతున్నారు. నిరక్షరత మరియు మూఢత్వంతో ఉన్న వర్గాలకు ఓటు విలువను వివరించడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. డబ్బుకు ఓటు వేయడం వల్ల కేవలం ఐదు సంవత్సరాల భవిష్యత్తునే కాకుండా, తమ కడుపు కూటిని కూడా కోల్పోతున్నామనే విషయాన్ని గుర్తించాలని కార్మికులు పిలుపునిస్తున్నారు. రాజకీయ నాయకులు పంపిణీ చేసే ప్రలోభాలకు లొంగ కుండా, ధరల నియంత్రణ మరియు ఉపాధి కల్పించే వారికే మద్దతు తెలపాలని వారు భావిస్తున్నారు. ఈ పరిస్థితి మారకపోతే వలసలు మరియు ఆకలి కేకలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని సామాజిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# దేశంలో భారీ పేలుళ్లకు కుట్ర

ఒక రహస్య సంస్థ వీరికి వెన్నుదన్నుగా నిలుస్తూ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. లక్నో రైల్వే స్టేషన్ సమీపంలోని కీలకమైన రైల్వే సిగ్నల్ బాక్సును ధ్వంసం చేసేందుకు మీరట్‌కు చెందిన ప్రధాన నిందితుడు సాకిబ్, మరో ముగ్గురు వ్యక్తులు ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ఈ సిగ్నల్ వ్యవస్థను దెబ్బతీయడం ద్వారా రైళ్ల ప్రమాదాలకు కారణమవ్వాలని వారు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ముఠాను పట్టుకోవడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. నిందితుల వద్ద నుంచి కొన్ని మ్యాపులు, ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుతో దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్న రైల్వే స్టేషన్లు, వంతెనలు మరియు ఇతర కీలక కట్టడాలకు చెందిన ఫొటోలు, వీడియోలను సాకిబ్ ఎప్పటికప్పుడు సేకరిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ రహస్య సమాచారాన్ని మరియు అక్కడి భద్రతా పరిస్థితులను అతను పాకిస్థాన్‌లోని తన హ్యాండ్లర్‌కు నిరంతరం చేరవేస్తున్నట్లు సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు గుర్తించారు. సరిహద్దుల అవతల నుంచి అందుతున్న ఆదేశాల మేరకు వీరు విధ్వంసానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. నిందితుల ఫోన్లను డేటా మైనింగ్ కోసం ల్యాబ్‌కు పంపారు, దీని ద్వారా ఈ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంతమంది వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ ఉగ్ర ముఠా అరెస్టుతో ఉత్తరప్రదేశ్ పోలీసులు మరియు నిఘా వర్గాలు హై అలర్ట్ ప్రకటించాయి. రైల్వే శాఖ కూడా అన్ని ప్రధాన స్టేషన్లలో నిఘాను పెంచాలని ఆదేశించింది. పట్టుబడిన నిందితుల వెనుక ఉన్న




ఆర్థిక మూలాలను, విదేశీ సంస్థల ప్రమేయాన్ని శోధిస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే ఇలాంటి శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ ఆపరేషన్ దేశ భద్రతా దళాల అప్రమత్తతకు నిదర్శనంగా నిలిచింది.

# బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి

సోషల్ మీడియాలో మరియు బహిరంగంగా తీవ్రమైన ఆరోపణలు వచ్చినా, ఆయనను ఇంకా చైర్మన్ పదవిలో కొనసాగించడం చంద్రబాబు అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. పవిత్రమైన తిరుమల ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందూ భక్తులు మరియు నెటిజన్లు ఈ నియామకాన్ని తప్పుబడుతున్నా, ముఖ్యమంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. బి.ఆర్. నాయుడు తన పదవిని అడ్డం పెట్టుకుని కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం మరియు తన సొంత మీడియా ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భక్తి భావంతో ఉండాల్సిన టీటీడీ చైర్మన్ పీఠాన్ని అపవిత్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక వివాదాస్పద వ్యక్తిని ఇటువంటి ఉన్నత పదవిలో కూర్చోబెట్టడం ద్వారా చంద్రబాబు భక్తుల మనోభావాలను తుంగలో తొక్కారని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై కూడా అంబటి రాంబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై వరుసగా అఘాయిత్యాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండటం దారుణమని అన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వం పరిమితమైందని ధ్వజమెత్తారు. తప్పులను ఎత్తి చూపుతున్న ప్రతిపక్ష నేతలపై దాడులు చేయించడం, అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికమని ఆయన దుయ్యబట్టారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన పూజల్లో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు మరియు భక్తులు పాల్గొన్నారు. బి.ఆర్. నాయుడును తొలగించే వరకు తమ పోరాటం ఆగదని, అన్ని జిల్లాల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని వైసీపీ నేతలు స్పష్టం చేశారు. ఆలయాల పవిత్రతను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని వారు పునరుద్ఘాటించారు. తిరుమల వెంకన్న సాక్షిగా జరుగుతున్న ఈ అన్యాయాన్ని భక్తులు ఎన్నటికీ క్షమించరని అంబటి పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పవిత్ర సంస్థలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చవద్దని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నెల్లూరులో నేరాల నియంత్రణకు డ్రోన్ నిఘా



- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు
- అసాంఘిక కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా
- ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతో అమలు

ఎస్‌పీఎస్ నెల్లూరు, మన గళం : జిల్లాలో నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు డ్రోన్‌ల ద్వారా నిఘా వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ డ్రోన్ పర్యవేక్షణతో పాటు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ చర్యలతో నేరాలపై కట్టుదిట్టమైన నియంత్రణ సాధ్యమవుతుందని పోలీసులు తెలిపారు. డ్రోన్ నిఘా ద్వారా దూర ప్రాంతాలు, గుంపులుగా చేరే ప్రదేశాలు, అనుమానాస్పద కదలికలను సులభంగా గుర్తించగలుగుతున్నామని పేర్కొన్నారు. దీంతో వెంటనే స్పందించి చర్యలు తీసుకునే అవకాశం పెరుగుతోందన్నారు. పోలీసులు ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, నూతన సాంకేతికతను వినియోగించి నేరాల నియంత్రణలో ముందడుగు వేస్తున్నారు. ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలను గమనిస్తే వెంటనే సమాచారాన్ని అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఈ విధమైన నిఘా చర్యలను కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. డ్రోన్ పర్యవేక్షణతో నేరాలపై మరింత ప్రభావవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమరావతి నిర్మాణ పనులపై ఉన్నత స్థాయి సమీక్ష

అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమరావతి రాజధాని ప్రాంతంలో దాదాపు రూ.57,821 కోట్ల విలువైన భారీ నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. రాజధాని నగరం రూపురేఖలను మార్చే అసెంబ్లీ, హైకోర్టు మరియు సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఈ ప్రతిష్టాత్మక భవనాలు రాష్ట్ర గౌరవానికి ప్రతీకలుగా నిలవాలని, అందుకు తగ్గట్టుగా అద్భుతమైన డిజైన్లతో పనులు వేగంగా జరగాలని సూచించారు. ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధుల విడుదల మరియు ఇతర పరిపాలనాపరమైన అడ్డంకులను తొలగించేందుకు సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భవన నిర్మాణాలతో పాటు నగరానికి వెన్నెముక వంటి ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ (లేఅవుట్) మౌలిక సదుపాయాల కల్పనపై కూడా సమీక్ష జరిగింది. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ మరియు విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక వసతుల కల్పన పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు కేటాయించిన లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. హౌసింగ్ ప్రాజెక్టులు కూడా వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశం అమరావతి నిర్మాణంలో మళ్లీ వేగం పుంజుకుందనే సానుకూల సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజధాని అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. వచ్చే కొద్ది నెలల్లోనే రాజధాని ప్రాంతంలో భారీ మార్పులు కనిపిస్తాయని, అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి చేసి అమరావతిని వెలుగులోకి తెస్తామని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

రాజధాని నిర్మాణాన్ని ఒక కాంట్రాక్ట్ పనిగా చూడవద్దని, ఇది ఒక చారిత్రక బాధ్యతని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా పనుల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అవసరమైన చోట అదనపు సిబ్బందిని, యంత్రాలను మోహరించి లక్ష్యాలను చేరుకోవాలని నిర్మాణ సంస్థలకు స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ మరియు అత్యాధునిక మౌలిక వసతులతో అమరావతిని ఒక "ఫ్యూచర్ సిటీ"గా నిలబెట్టేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్షతో రాజధాని నిర్మాణ రంగంలో మరింత ఉత్సాహం నెలకొంది.

# రాయచూర్‌లో నారా లోకేశ్ పర్యటన

పాల్గొన్నారు. హోసల్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్' ప్రారంభోత్సవ వేడుకకు లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర మంత్రులతో కలిసి ఈ పాఠశాలను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం, పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర స్వామి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. స్థానిక తెలుగు ప్రజలు మరియు పాఠశాల నిర్వాహకులు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు.

ఈ పర్యటనలో భాగంగా విద్యాసంస్థకు సంబంధించిన పలు భవనాలను మంత్రి ప్రారంభించారు. శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన లోకేశ్, దానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల వ్యవస్థాపకులలో ఒకరైన దివంగత డాక్టర్ దండమూడి రాధాకృష్ణ జ్ఞాపకార్థం నిర్మించిన 'డా. రాధాకృష్ణ కళాధామ' ఓపెన్ ఆడిటోరియంను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. విద్యా రంగంలో ఇటువంటి సంస్థల స్థాపన విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ మరియు కర్ణాటకకు చెందిన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. అనంతరం సింధనూరు-గంగావతి రోడ్డులోని తెలుగు సంఘం కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, సంజయ్ సేథ్‌లతో కలిసి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన స్థానిక తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహం ఈ ప్రాంతంలో కొలువుదీరడం తెలుగు వారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. తన ప్రసంగంలో లోకేశ్ తెలుగు ప్రజల పట్ల తన కృతజ్ఞతను చాటుకున్నారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసిన క్లిష్ట సమయంలో సింధనూరు, రాయచూర్ ప్రాంతాల్లోని తెలుగు ప్రజలు అండగా నిలిచారని, ఆ రుణం తీర్చుకునేందుకే తాను ఇక్కడికి వచ్చానని ఆయన భావోద్వేగంగా చెప్పారు.

# ఐటీ రంగంలో ఏఐ రీ-స్ట్రక్చరింగ్ ప్రకంపనలు

**- దిగ్గజ సంస్థల్లో కొనసాగుతున్న ఉద్యోగ కోతలు - ఒరాకిల్, అమెజాన్, మెటా సంస్థల్లో వేల సంఖ్యలో లేఆఫ్స్ ప్రకటన**
**- భారతీయ టెక్ మార్కెట్‌లో 8 శాతం తగ్గిన ఉద్యోగ అవకాశాలు - ఏఐ నైపుణ్యం ఉంటేనే భవిష్యత్తు - ఫ్రెషర్లపై పెరుగుతున్న ఒత్తిడి**




మన గళం డెస్క్ : ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగం ప్రస్తుతం ఒక భారీ మార్పు దిశగా పయనిస్తోంది. గత వారం రోజుల్లో ఒరాకిల్ వంటి టెక్ దిగ్గజాలు ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించగా, అందులో కేవలం భారతదేశం నుంచే 12,000 మంది ఉండటం గమనార్హం. కేవలం ఖర్చు తగ్గించుకోవడం కోసమే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు మళ్లించే క్రమంలో ఈ 'ఏఐ రీ-అలైన్‌మెంట్' లేఆఫ్స్ జరుగుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అమెజాన్, మెటా మరియు అట్లాసియన్ వంటి సంస్థలు కూడా ఇదే బాటలో పయనిస్తూ వేల సంఖ్యలో సిబ్బందికి ఉద్వాసన పలికాయి. ఈ పరిణామాలు కేవలం ఆర్థిక ఇబ్బందుల వల్ల కాకుండా, ఏఐ టూల్స్ సహాయంతో తక్కువ మందితో ఎక్కువ పనిని సాధించాలనే కంపెనీల కొత్త వ్యూహాల వల్ల చోటుచేసుకుంటున్నాయి. భారతదేశంలోని ఐటీ హబ్‌లైన బెంగళూరు మరియు హైదరాబాద్‌లలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తాజా 'ఎక్స్‌ఫెనో' నివేదిక ప్రకారం, ఏప్రిల్ 2026 నాటికి భారత ఐటీ రంగంలో యాక్టివ్ ఉద్యోగ అవకాశాలు గత నెలతో పోలిస్తే 8 శాతం తగ్గాయి. దేశీయ ఐటీ సేవల రంగంలో ప్రధాన ఆదాయ వనరులైన అమెరికా మరియు యూరప్ క్లయింట్లు తమ ఐటీ బడ్జెట్‌లను తగ్గించుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు కూడా ఈ నెలలో తమ నియామకాలను 21 శాతం తగ్గించుకున్నట్లు సమాచారం. గడిచిన ఆరేళ్లలో ఐటీ రంగం అత్యంత తక్కువ నియామకాలతో ఈ కొత్త ఆర్థిక సంవత్సరాన్ని ప్రారంభించడం విశేషం. ఇది ఉద్యోగుల్లో భద్రత పట్ల ఆందోళనను మరింత పెంచుతోంది.

ముఖ్యంగా కొత్తగా విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఫ్రెషర్లకు ప్రస్తుత పరిస్థితులు గడ్డు కాలంగా మారాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగ అవకాశాలు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం పడిపోయాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్ల సంఖ్య తగ్గడమే కాకుండా, ఇప్పటికే ఆఫర్ లెటర్లు అందుకున్న వారికి జాయినింగ్ తేదీలు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మొత్తం ఉద్యోగ డిమాండ్‌లో ఫ్రెషర్ల వాటా కేవలం 14 శాతానికి పరిమితం కాగా, అనుభవజ్ఞులైన నిపుణులకు 54 శాతం వాటా దక్కుతోంది. చాలా కంపెనీలు 'హైప్' రోల్స్ కంటే కూడా వ్యాపారానికి నేరుగా విలువను చేకూర్చే టెక్నికల్ రోల్స్ కే మొగ్గు చూపుతున్నాయి. ఈ అనిశ్చితి వల్ల వేలాది మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు తమ కెరీర్ ప్రారంభం కావడమే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే ఐటీ నిపుణులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవడం తప్పనిసరి. సాంప్రదాయ కోడింగ్ నైపుణ్యాల కంటే కూడా ఏఐ ఇన్ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఇంజనీరింగ్ మరియు క్లౌడ్ ఆర్కిటెక్చర్ వంటి విభాగాల్లో 2026లో భారీ డిమాండ్ నెలకొంది. రాబోయే కాలంలో ఏఐ పట్ల అవగాహన కలిగి ఉండటం అనేది ఒక అదనపు అర్హత కాదని, అది ఒక ప్రాథమిక అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవడమే కాకుండా, 'ఏఐ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్', 'ఏజెంటిక్ ఏఐ ఇంజనీర్' వంటి సరికొత్త ఉద్యోగ విభాగాలు పుట్టుకొస్తున్నాయి. సాధారణ పనులు చేసే ప్రోగ్రామర్ల కంటే, సంక్లిష్టమైన సమస్యలను ఏఐ తో కలిపి పరిష్కరించగల నైపుణ్యం ఉన్నవారికే మార్కెట్‌లో ప్రాధాన్యత లభిస్తోంది.

మరోవైపు అంతర్జాతీయంగా చూస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కొంత స్థిరంగానే ఉన్నప్పటికీ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు ఏఐ టెక్నాలజీపై అతిగా ఆధారపడటం వల్ల కొత్త ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2026లో ప్రపంచ వృద్ధి రేటు 3.3 శాతంగా ఉండవచ్చు. ప్రభుత్వం మరియు ఐటీ సంస్థలు కలిసి పనిచేసి, ఉద్యోగుల కోసం రీ-స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన అవసరం ఉంది. స్వదేశీ స్టార్టప్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా విదేశీ క్లయింట్లపై ఆధారపడటం తగ్గించుకోవాలని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఐటీ రంగం మళ్ళీ పుంజుకుంటుందని, అయితే ఈ ప్రయాణంలో నిరంతర అభ్యాసం మరియు సాంకేతిక మార్పులకు అనుగుణంగా మారడం మాత్రమే నిపుణులను రక్షిస్తుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.

## వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు వేగవంతం

**- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : నగరంలో వీధి కుక్కల నివారణకు చర్యలు వేగవంతం చేయాలని, తాత్కాలిక డాగ్ షెల్టర్ పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన గార్గేయపురం డంప్‌యార్డును సందర్శించారు. బయో మైనింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, స్వచ్ఛ సర్వేక్షన్ మార్గదర్శకాల అమలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. డిఈఈ పవణ్ కళ్యాణ్, శానిటేషన్ ఇంస్పెక్టర్ యువరాజు, స్వరాష్ట్ర ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సమీక్షా సమావేశం



మన గళం,కర్నూలు లీగల్ : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శనివారం జిల్లా న్యాయ సేవా సదన్ లో కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కామేశ్వర ప్రసాద్ తో ప్రజలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేలా గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 7వ తేదీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కర్నూల్ నందు గల విలేజ్ అర్బన్ సెంటర్లలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కీలక సమస్యలపై ప్రచారం చేయాలని కోరారు. అలాగే ప్రజల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టాలని కోరారు. వైద్య సదుపాయం అందుబాటులో లేని గ్రామాలలో మెడికల్ క్యాంపులను నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కామేశ్వర ప్రసాద్ మరియు ఇతర డాక్టర్స్ పాల్గొన్నారు.

## రికార్డు లాభంతో రూపాయి పుంజుకుంది




ముంబై, మన గళం : భారత కరెన్సీ మార్కెట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర బ్యాంక్ తీసుకున్న కఠిన చర్యల ప్రభావంతో రూపాయి విలువ ఒక్కరోజులోనే భారీగా పుంజుకుని పదమూడు ఏళ్లలోనే అత్యధిక లాభాన్ని నమోదు చేసింది. గురువారం రూపాయి విలువ సుమారు 1.8 శాతం పెరిగి 93.10 వద్ద ముగియడం మార్కెట్‌లో చర్చనీయాంశమైంది.

గత కొంతకాలంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ వచ్చింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల వంటి కారణాలతో రూపాయి విలువ క్షీణించింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు పది శాతం వరకు పడిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది.

ఈ నేపథ్యంలో కేంద్ర బ్యాంక్ సాధారణ చర్యలకంటే ముందుకు వెళ్లి కఠిన నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా బ్యాంకులు ఆర్బిట్రేజ్ ట్రేడింగ్ ద్వారా లాభాలు పొందుతున్న విధానాన్ని నియంత్రించేందుకు నికర ఓపెన్ పొజిషన్‌ను వంద మిలియన్ డాలర్లకు పరిమితం చేసింది. ఈ నిర్ణయం వల్ల బ్యాంకులు తమ డాలర్ నిల్వలను తగ్గించాల్సి రావడంతో మార్కెట్‌లో డాలర్ల విక్రయాలు పెరిగాయి. డాలర్ సరఫరా పెరగడంతో రూపాయి విలువ బలపడింది. అయితే ఈ మార్పులు బ్యాంకింగ్ రంగంపై ఒత్తిడిని కూడా పెంచాయి. బ్యాంకింగ్ సూచీలు పడిపోవడం ద్వారా మార్కెట్‌లో ఆందోళన వ్యక్తమైంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఈ పరిణామాల వల్ల బ్యాంకులకు గణనీయమైన నష్టం సంభవించే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, కరెన్సీ మార్కెట్‌ను స్థిరపరిచే దిశగా తీసుకున్న వ్యూహాత్మక చర్యల ఫలితంగానే రూపాయి ఈ స్థాయిలో పుంజుకుందని భావిస్తున్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, మూలధన ప్రవాహాలు రూపాయి మార్గాన్ని నిర్ణయించనున్నాయి.

## ఎంబిబిఎస్ ఫైనల్ పరీక్షలను ఆకస్మిక తనిఖీ చేసిన వైస్ ఛాన్స్ లర్



(మన గళం,కర్నూలు వైద్యం) : రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో ఫైనల్ పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ... యూనివర్సిటీ పరీక్షలన్నీ పకడ్బంధింగా నిర్వహిస్తున్నామని వాటికి మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మరియు ఎటువంటి చిన్న పొరపాట్ల కు కూడా అవకాశం లేకుండా ఉండేందుకు ఆకస్మిక తనిఖీలను చేస్తున్నామని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ పార్ట్ 2 పరీక్షలు జరుగుతున్న కేంద్రం వద్దకు నేరుగా వెళ్లి పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో జరుగుతున్న ఫైనలియర్ పార్ట్ 2 పరీక్షలను యూనివర్సిటీ నుంచి ప్రత్యేక బృందాలు ఆకస్మికంగా తనిఖీ ప్రక్రియను ప్రారంభించామని ఆయన తెలిపారు. గురువారం విజయవాడలోని ఒక మెడికల్ కాలేజీలో పరీక్షలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. త్వరలో రిజిస్ట్రార్ కూడా పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారని తెలిపారు. పరీక్షలలో విద్యార్థులు ఎటువంటి మాల్ ప్రాక్టీస్ చేసిన వారిని రెండు సంవత్సరాలు వరకు డీబార్ చేస్తామని కావున విద్యార్థులు కష్టపడి చదవాలని ఎటువంటి ప్రలోభాల వైపు వెళ్ళవద్దని సూచించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైద్య విద్యా వ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందని మెడికల్ కాలేజీలోని అన్ని పరీక్షల నిర్వహణ తీరును యూనివర్సిటీ నుంచి లైవ్ వెబ్ కాస్ట్ ద్వారా ప్రత్యేక అధికారులు నిరంతరం గమనిస్తున్నారనీ తెలిపారు. కేవలం మెడికల్ విద్యార్థులే కాక యూనివర్సిటీ ద్వారా నిర్వహించే అన్ని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరోవైపు యూనివర్సిటీ విద్యార్థులను అకాడమిక్ యాక్టివిటీ మరింతగా మెరుగుపరుస్తూ రీసెర్చ్ ఆక్టివిటీ వైపు అదేవిధంగా క్రీడలు సాంస్కృతి రంగాల్లో ముందుకు తీసుకుపోయేందుకు అనేక మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంఈ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ పరీక్షల నిర్వహణ తీరును ఏర్పాట్లను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా 90 శాతం పూర్తయిన లెక్చరర్ గ్యాలరీ గురించి వైస్ ఛాన్స్ లకు వివరించడం జరిగింది. గ్యాలరీ నిర్మాణం పూర్తయిందని కేవలం ఎలక్ట్రిఫికేషన్ ఇంటర్నల్ గా సౌండ్ సిస్టం వాటి పనులు పెండింగ్ ఉన్నాయని వాటిని పూర్తి చేసి కాలేజీ కనిపిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని విసికి తెలిపారు. పెండింగ్ పనులపై త్వరలో నిర్ణయాలు తీసుకుంటామనీ విసి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సింధియా శుభప్రద, యూనివర్సిటీ స్పెషల్ అబ్జర్వర్ ప్రొఫెసర్ రంగయ్య , పరీక్షల చీఫ్ సూపరెండెంట్ ప్రొఫెసర్ రాజేష్ పరీక్ష నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్ నిర్ణయంతో అప్రమత్తమైన డెల్

హైదరాబాద్, మన గళం : అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ డెల్ పై ఇరాన్ ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయం అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. డెల్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడంపై కంపెనీ తీవ్రంగా స్పందిస్తూ, తన ఉద్యోగుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో డెల్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగులకు ప్రత్యేక ట్రావెల్ అడ్వయిజరీ జారీ చేసింది. ఇరాన్‌కు ఎవరూ ప్రయాణించకూడదని స్పష్టం చేయడంతో పాటు, ఇప్పటికే అక్కడ ఉన్న ఉద్యోగులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఈ నిర్ణయం కంపెనీ ఉద్యోగుల భద్రతపై ఎంత ప్రాధాన్యం ఇస్తోందో చూపిస్తోంది.

అదేవిధంగా, ఇరాన్‌కు చెందిన సంస్థలు లేదా వ్యక్తులతో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరపకూడదని డెల్ కఠిన ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధాలు పెట్టుకోవడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఈ చర్యలు సంస్థను భవిష్యత్తులో తలెత్తే సమస్యల నుంచి రక్షించేందుకు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలుగా భావిస్తున్నారు.

మరోవైపు, కంపెనీ అంతర్గత వ్యవస్థల భద్రతపై కూడా డెల్ ప్రత్యేక దృష్టి సారించింది. డేటా సెక్యూరిటీ, నెట్‌వర్క్ రక్షణ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఐటీ విభాగాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. సైబర్ దాడుల ముప్పు పెరిగే అవకాశమున్నందున ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఇక ఈ పరిణామం అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకు మరో ఉదాహరణగా నిలుస్తోంది. సాంప్రదాయ సైనిక ఘర్షణలతో పాటు ఇప్పుడు టెక్నాలజీ, వ్యాపార రంగాలపై కూడా ప్రభావం పడుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో పనిచేసే ఐటీ సంస్థలు ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది

# ఏసీ లేదా కూలర్..? ఆరోగ్యానికి ఏది మంచిది



హైదరాబాద్, మన గళం : ఎండాకాలం తీవ్రంగా పెరుగుతున్న వేళ చల్లదనం కోసం చాలా మంది ఏసీ లేదా కూలర్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే కేవలం చల్లదనం మాత్రమే కాకుండా ఆరోగ్యపరంగా ఏది మంచిదో తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ రెండు పరికరాలకు తమతమ ప్రత్యేకతలు, ప్రభావాలు ఉన్నాయి.

కూలర్ బయటి గాలిని లోపలికి తీసుకుని నీటి సహాయంతో చల్లబరుస్తుంది. దీంతో గదిలో తాజా గాలి ప్రవహిస్తూ ఆక్సిజన్ స్థాయిలు మెరుగ్గా ఉంటాయి. గాలిలో తేమ ఉండటంతో శ్వాస తీసుకోవడం సులభమవుతుంది. ముఖ్యంగా పొడి వాతావరణం ఉన్న ప్రాంతాల్లో కూలర్ సహజమైన చల్లదనాన్ని అందిస్తుంది. ఇక ఏసీ మాత్రం గదిలో ఉన్న గాలినే మళ్లీ మళ్లీ చల్లబరుస్తుంది. గది మూసి ఉండటం వల్ల బయటి గాలి లోపలికి రావడం తగ్గిపోతుంది. దీంతో గాలిలో తేమ తగ్గి చర్మం పొడిబారడం, గొంతు ఇబ్బందులు, అలర్జీలు వంటి సమస్యలు రావచ్చు. ఎక్కువసేపు ఏసీలో ఉండి ఒక్కసారిగా బయటకు వెళితే శరీర ఉష్ణోగ్రత మార్పులతో జలుబు వంటి సమస్యలు కూడా కలగవచ్చు. వాతావరణాన్ని బట్టి వీటి ఎంపిక మారుతుంది. తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏసీ మంచిగా పనిచేస్తుంది. తేమ తక్కువగా ఉండే ప్రాంతాల్లో కూలర్ మంచి ఫలితాన్ని ఇస్తుంది. అందుకే మీ ప్రాంత పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవడం అవసరం. ఏ పరికరం వాడినా కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. కూలర్ నీటిని తరచుగా మార్చడం, శుభ్రంగా ఉంచడం అవసరం. లేకపోతే బ్యాక్టీరియా, దోమలు పెరిగే ప్రమాదం ఉంది. ఏసీ వాడేటప్పుడు ఉష్ణోగ్రతను అతిగా తగ్గించకుండా ఉంచడం, అప్పుడప్పుడు గది కిటికీలు తెరవడం ద్వారా తాజా గాలి లోపలికి వచ్చేలా చూసుకోవాలి. మొత్తానికి, ఆరోగ్యపరంగా చూసుకుంటే సహజ గాలి ప్రవాహం ఉండే కూలర్ కొంతమేర మెరుగ్గా భావించినా, సరైన విధంగా వాడితే ఏసీ కూడా హానికరం కాదు. సరైన జాగ్రత్తలు పాటిస్తే రెండింటినీ సురక్షితంగా ఉపయోగించవచ్చు.

# తక్కువ ధరలో టాప్ ఈవీ స్కూటర్లు



హైదరాబాద్, మన గళం :దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ స్కూటర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. పెరుగుతున్న ఇంధన ధరలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగడం వంటి కారణాలతో వినియోగదారులు ఈవీ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే స్కూటర్లకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్లలో కొన్ని మోడళ్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. అందులో ముఖ్యంగా టీవీఎస్ ఐక్యూబ్ ప్రముఖ స్థానంలో నిలిచింది. ఈ స్కూటర్ మూడు వేరియంట్లలో లభిస్తూ, బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి ఒకసారి ఛార్జ్ చేస్తే సుమారు 94 కిలోమీటర్ల నుంచి 212 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ధర కూడా అందుబాటులో ఉండటంతో ఇది విస్తృతంగా అమ్ముడవుతోంది. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఏథర్ రిజ్టా కూడా మంచి ఆదరణ పొందుతోంది. ఈ స్కూటర్ సౌకర్యవంతమైన డిజైన్, ఆధునిక ఫీచర్లతో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 123 నుంచి 159 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. కుటుంబ ప్రయాణాలకు అనువైన ఎంపికగా ఇది నిలుస్తోంది. మరోవైపు బలమైన నిర్మాణం కోరుకునే వారికి బజాజ్ చేతక్ మంచి ఎంపికగా ఉంది. పూర్తి మెటల్ బాడీతో రూపొందిన ఈ స్కూటర్ మన్నికగా ఉండటమే కాకుండా 113 నుంచి 151 కిలోమీటర్ల వరకు రేంజ్ ఇస్తుంది. దృఢత్వం, నమ్మకాన్ని ప్రాధాన్యంగా చూసే వారికి ఇది సరైన ఎంపికగా భావిస్తున్నారు.

సుజుకి సంస్థ నుంచి వచ్చిన సుజుకి ఇయాక్సెస్ కూడా వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. సుమారు 95 కిలోమీటర్ల రేంజ్ ఇచ్చే ఈ స్కూటర్ నమ్మకమైన ఇంజనీరింగ్‌తో రూపొందించబడింది. కొత్తగా ఈవీ వాహనం కొనాలనుకునే వారికి ఇది మరో మంచి ప్రత్యామ్నాయంగా ఉంది.మొత్తంగా చూస్తే ప్రతి వినియోగదారుడి అవసరానికి తగ్గట్టుగా మార్కెట్లో ఎన్నో ఎలక్ట్రిక్ స్కూటర్లు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ రేంజ్ కావాలంటే ఒకటి, కుటుంబ అవసరాలకు మరొకటి, బలమైన నిర్మాణం కోరుకుంటే ఇంకొకటి అనే విధంగా ఎంపిక చేసుకునే అవకాశాలు ఉన్నాయి. బడ్జెట్, వినియోగం, అవసరాలను బట్టి సరైన స్కూటర్‌ను ఎంచుకుంటే దీర్ఘకాలంలో ఖర్చులు తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సీఎన్‌జీ ధరల పెంపు.. వాహనదారులకు భారంగా మారిన ఖర్చులు




హైదరాబాద్, మన గళం :దేశవ్యాప్తంగా ఇంధన ధరలు వరుసగా పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు సీఎన్‌జీ ధరలు కూడా పెరగడం వాహనదారులకు షాక్‌గా మారింది. ఇప్పటికే పెట్రోలు, డీజిల్, వాణిజ్య ఎల్‌పీజీ ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇప్పుడు సీఎన్‌జీ ధరల పెంపు సామాన్యులపై మరింత భారం మోపుతోంది.రితాజాగా ఒక ప్రముఖ గ్యాస్ సంస్థ సీఎన్‌జీ ధరలను కిలోకు రూ.2.50 పెంచినట్లు ప్రకటించింది. ఈ పెంపుతో రోజువారీగా సీఎన్‌జీపై ఆధారపడే ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో ఇబ్బంది పడుతున్న వారికి ఈ పెంపు మరింత ఒత్తిడిని తీసుకొచ్చింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులే నిలుస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు సరఫరా మార్గాల్లో ఏర్పడుతున్న అంతరాయాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ముడి చమురు ధరలు భారీగా పెరిగి బ్యారెల్‌కు అధిక స్థాయికి చేరుకోవడం కూడా ఈ పెంపుకు కారణమైంది. ఇక వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు కూడా ఇటీవల భారీగా పెరిగాయి. దేశ రాజధానిలో 19 కిలోల సిలిండర్ ధర రూ.2 వేలకుపైగా చేరడం గమనార్హం. అయితే గృహ వినియోగ గ్యాస్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

అలాగే ఏవియేషన్ టర్బైన్ ఇంధన ధరలు పెరగడంతో విమాన టికెట్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం కేవలం రవాణా రంగానికే కాకుండా, హోటల్, వ్యాపార రంగాలపై కూడా పడుతోంది. పెరుగుతున్న ఖర్చులతో వ్యాపారులు, వినియోగదారులు రెండువర్గాలూ ఇబ్బందులు పడుతున్నారు. మొత్తంగా చూస్తే ఇంధన ధరల పెరుగుదల ప్రభావం అన్ని రంగాలపై పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో కూడా అంతర్జాతీయ పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## భారీ తగ్గింపుతో ఐఫోన్ కొనుగోలు అవకాశం



హైదరాబాద్,మన గళం : టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆపిల్ తన 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు భారీ ఆఫర్లను ప్రకటించింది. ముఖ్యంగా ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌గా పేరుగాంచిన ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై గణనీయమైన ధర తగ్గింపును అందించడం మార్కెట్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో లక్షా నలభై తొమ్మిది వేల తొమ్మిది వందల రూపాయలుగా ఉన్న ఈ ఫోన్ ధర ఇప్పుడు లక్ష రెండు వేల తొమ్మిది వందల రూపాయలకు తగ్గింది. అధీకృత రిటైల్ స్టోర్ల ద్వారా ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులోకి వచ్చింది.ఈ ధర తగ్గింపుకు పలు కారణమయ్యాయి. బ్యాంక్ క్యాష్‌బ్యాక్, తక్షణ డిస్కౌంట్, ఎక్స్చేంజ్ బోనస్ వంటి ప్రయోజనాలను కలిపి వినియోగదారులకు భారీ లాభం కలిగేలా రూపొందించారు. పాత ఫోన్ ఇచ్చి కొత్తది కొనుగోలు చేసే వారికి మరింత తగ్గింపు లభిస్తోంది. దీంతో ప్రీమియం ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం గా మారింది.ఈ సేల్ కేవలం ఫోన్లకే పరిమితం కాకుండా ఇతర పరికరాలపైనా వర్తిస్తోంది. టాబ్లెట్లు, స్మార్ట్ వాచ్‌లు వంటి ఉత్పత్తులపై కూడా ధరలు తగ్గించారు. దీంతో ఆపిల్ ఉత్పత్తులను తక్కువ ధరలో సొంతం చేసుకునే అవకాశం వినియోగదారులకు లభిస్తోంది.ఫీచర్ల విషయానికి వస్తే, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ శక్తివంతమైన పనితీరుతో ఆకట్టుకుంటోంది. పెద్ద డిస్‌ప్లే, వేగవంతమైన ప్రాసెసర్, అధునాతన కెమెరా వ్యవస్థ ఈ ఫోన్‌కు ప్రధాన ఆకర్షణలు. దీర్ఘకాలిక బ్యాటరీ సామర్థ్యం, మెరుగైన కనెక్టివిటీ సౌకర్యాలు వినియోగదారులకు మరింత అనుభవాన్ని అందిస్తున్నాయి.మొత్తానికి, ఇలాంటి భారీ తగ్గింపులు చాలా అరుదుగా రావడంతో ఈ ఆఫర్ టెక్నాలజీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రీమియం ఫోన్ కొనాలనుకునే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బంగారం, వెండి ధరలు స్థిరం



హైదరాబాద్, మన గళం : ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో బంగారం డిమాండ్ స్థిరంగా కొనసాగుతుండగా, ధరలు కూడా గత కొన్ని రోజులుగా పెద్దగా మార్పులు లేకుండా నిలకడగా ఉన్నాయి. శనివారం ఉదయం స్వల్ప పెరుగుదల నమోదైనప్పటికీ, మొత్తంగా చూస్తే బంగారం ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. ఈ రోజు ఉదయం ఆరు గంటల సమయానికి దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,50,940 వద్ద కొనసాగుతుండగా, 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,38,350 వద్ద ఉంది. దేశ రాజధానిలో మాత్రం స్వల్పంగా ఎక్కువగా నమోదు కాగా, అక్కడ 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,090, 22 క్యారెట్ల ధర రూ.1,38,510గా ఉంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ నగరాల్లో బంగారం ధరలు దేశ సగటు స్థాయిలోనే ఉన్నాయి. ముంబై, బెంగళూరు, కోల్‌కతా, కేరళ వంటి ప్రాంతాల్లో కూడా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. చెన్నైలో మాత్రం స్వల్పంగా ఎక్కువగా ధరలు నమోదు కావడం గమనార్హం.

ఇక వెండి విషయానికి వస్తే, ధరలు స్వల్పంగా తగ్గుదల చూపుతున్నాయి. ప్రస్తుతం వెండి కిలో ధర సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల పరిధిలో కదులుతోంది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, కేరళ వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ.2,54,900గా ఉండగా, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లో రూ.2,49,900 వద్ద ఉంది. మొత్తం మీద బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతుండగా, వెండి స్వల్పంగా తగ్గిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రపంచ రాజకీయ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో కూడా ఈ విలువైన లోహాల ధరలు ఇదే విధంగా మార్పులు చూపే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## గిగ్ విప్లవం ఒక చారిత్రాత్మక ముందడుగు

మన గళం డెస్క్ : భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వేగంగా విస్తరిస్తున్న గిగ్ ఎకానమీ లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల జీవితాల్లో 2026 ఏప్రిల్ నెల ఒక కొత్త వెలుగును నింపింది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ 'తెలంగాణ ప్లాట్‌ఫారమ్ ఆధారిత గిగ్ వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత మరియు సంక్షేమం) బిల్లు 2026'ను ఆమోదించడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచింది. డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు మరియు ఇతర యాప్ ఆధారిత సేవలలో పనిచేస్తున్న సుమారు 4 లక్షల మంది కార్మికులకు ఈ చట్టం ద్వారా చట్టబద్ధమైన గుర్తింపు లభించింది. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అనిశ్చితితో కూడిన వారి బతుకులకు ఒక భరోసా.

ఈ నూతన చట్టం ప్రకారం, గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నారు. అగ్రిగేటర్లు (జొమాటో, స్విగ్గీ, ఓలా వంటి సంస్థలు) తమ ప్రతి లావాదేవీపై 1 నుండి 2 శాతం వరకు సంక్షేమ రుసుమునుప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిధుల ద్వారా కార్మికులకు ప్రమాద బీమా, ఆరోగ్య సదుపాయాలు, ప్రసూతి సెలవులు మరియు పెన్షన్ వంటి కీలకమైన సామాజిక భద్రతా పథకాలను అమలు చేస్తారు. ప్రతి గిగ్ వర్కర్ కి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించడం ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా వారికే అందేలా పారదర్శకతను తీసుకువచ్చారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఈ బిల్లు మరో కీలక అడుగు వేసింది. ప్లాట్‌ఫారమ్ కంపెనీలు తమ అల్గారిథమ్స్) మరియు పేమెంట్ విధానాల్లో పారదర్శకతను పాటించాలని, ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా కార్మికులను పనిలో నుండి తొలగించకూడదని నిబంధనలు విధించారు. ఒకవేళ కంపెనీలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు కూడా విధించేలా చట్టం కఠినతను పెంచింది. దీనివల్ల కార్మికులకు కేవలం ఆర్థిక భద్రత మాత్రమే కాకుండా, వృత్తిపరమైన గౌరవం మరియు పని భద్రత కూడా లభిస్తాయి.

జాతీయ స్థాయిలో కూడా కేంద్ర ప్రభుత్వం 'ఈ-శ్రమ్' పోర్టల్ ద్వారా అసంఘటిత రంగ కార్మికుల డేటాను ఏకీకృతం చేస్తూ, వారిని సామాజిక భద్రతా వలయంలోకి తీసుకువస్తోంది. 2026 నాటికి దేశవ్యాప్తంగా సుమారు 31 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు ఈ పోర్టల్‌లో నమోదయ్యారు. తెలంగాణతో పాటు రాజస్థాన్, కర్ణాటక వంటి రాష్ట్రాలు కూడా తమదైన శైలిలో గిగ్ వర్కర్ల రక్షణ కోసం చట్టాలు తీసుకురావడం శుభపరిణామం. అయితే, ఈ చట్టాల అమలులో అగ్రిగేటర్ సంస్థల నుండి ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో పని స్వభావం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు ఉద్యోగం అంటే కేవలం కార్యాలయానికి వెళ్లడం మాత్రమే ఉండేది, కానీ నేడు స్మార్ట్‌ఫోన్ ఉంటే ఎవరైనా, ఎక్కడైనా పని చేసుకునే వీలు కలిగింది. అయితే ఈ సౌలభ్యం వెనుక సామాజిక రక్షణ లేకపోవడం పెద్ద లోపంగా మారింది. గిగ్ వర్కర్లు అటు ఉద్యోగులుగా కాక, ఇటు స్వయం ఉపాధి పొందుతున్న వారు కాక మధ్యలో ఉండిపోయారు. ఈ బిల్లు వారిని 'ప్లాట్‌ఫారమ్ వర్కర్స్'గా గుర్తించడం ద్వారా వారి శ్రమకు ఒక చట్టబద్ధమైన నిర్వచనాన్ని ఇచ్చింది.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ కార్మికుల పని వేళలపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. రోజుకు 12 నుండి 14 గంటల పాటు రోడ్లపై తిరుగుతూ సేవలు అందించే డెలివరీ భాగస్వాముల శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సి ఉంది. పని ఒత్తిడి కారణంగా జరిగే ప్రమాదాలకు కంపెనీలే బాధ్యత వహించేలా చట్టంలో పొందుపరిచిన నిబంధనలు హర్షణీయం. అలాగే, వారి ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులకు న్యాయం వేగంగా అందే అవకాశం కలుగుతుంది. ఆర్థిక కోణంలో చూస్తే, గిగ్ ఎకానమీ దేశ జిడిపిలో కీలక పాత్ర పోషిస్తోంది. కానీ ఈ వృద్ధి కార్మికుల రక్తస్వేదంతో కాకుండా, వారి సంతోషంతో ముడిపడి ఉండాలి. కంపెనీలు లాభాల వేటలో కార్మికుల కనీస వేతనాలను విస్మరించకూడదు. కనీస వేతన చట్టం పరిధిలోకి గిగ్ వర్కర్లను తీసుకురావడంపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇది భవిష్యత్తులో మరింత పటిష్టమైన కార్మిక వ్యవస్థకు దారితీస్తుంది. టెక్నాలజీ అనేది మనిషిని బానిసగా మార్చకూడదు, అది మనిషి ఎదుగుదలకు తోడ్పడే ఇంధనంగా ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విప్లవాత్మక మార్పు, దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అసంఘటిత కార్మికుల హక్కుల పోరాటానికి ఒక దిక్సూచిగా నిలుస్తుంది. సామాజిక భద్రత కలిగిన శ్రామిక శక్తే దేశాభివృద్ధికి నిజమైన వెన్నెముక అని ఈ నిర్ణయం మరోసారి నిరూపించింది. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచి, గిగ్ వర్కర్ల జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకువస్తాయని ఆశిద్దాం. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది మరియు డిజిటల్ భారతం మరింత శక్తివంతంగా మారుతుంది. అలాగే, వారి ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులకు న్యాయం వేగంగా అందే అవకాశం కలుగుతుంది. ఆర్థిక కోణంలో చూస్తే, గిగ్ ఎకానమీ దేశ జిడిపిలో కీలక పాత్ర పోషిస్తోంది. కానీ ఈ వృద్ధి కార్మికుల రక్తస్వేదంతో కాకుండా, వారి సంతోషంతో ముడిపడి ఉండాలి. కంపెనీలు లాభాల వేటలో కార్మికుల కనీస వేతనాలను విస్మరించకూడదు. కనీస వేతన చట్టం పరిధిలోకి గిగ్ వర్కర్లను తీసుకురావడంపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇది భవిష్యత్తులో మరింత పటిష్టమైన కార్మిక వ్యవస్థకు దారితీస్తుంది. టెక్నాలజీ అనేది మనిషిని బానిసగా మార్చకూడదు, అది మనిషి ఎదుగుదలకు తోడ్పడే ఇంధనంగా ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విప్లవాత్మక మార్పు, దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అసంఘటిత కార్మికుల హక్కుల పోరాటానికి ఒక దిక్సూచిగా నిలుస్తుంది. సామాజిక భద్రత కలిగిన శ్రామిక శక్తే దేశాభివృద్ధికి నిజమైన వెన్నెముక అని ఈ నిర్ణయం మరోసారి నిరూపించింది. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచి, గిగ్ వర్కర్ల జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకువస్తాయని ఆశిద్దాం. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది మరియు డిజిటల్ భారతం మరింత శక్తివంతంగా మారుతుంది.

# ఏడాదికే గ్రాట్యుటీ.. కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట




హైదరాబాద్, మన గళం : దేశంలో కార్మిక సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులను అమలు చేసింది. గతంలో ఒక సంస్థలో గ్రాట్యుటీ పొందాలంటే కనీసం ఐదేళ్లు నిరంతర సేవలు చేయాల్సిన నిబంధన ఉండేది. అయితే ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తూ, కేవలం ఒక ఏడాది సేవ పూర్తిచేసినా గ్రాట్యుటీ పొందేలా కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మార్పు ముఖ్యంగా కాంట్రాక్ట్ మరియు నిర్ణీత కాలం ఉద్యోగులకు పెద్ద ఊరటగా మారింది. ఇప్పటి వరకు ఉద్యోగం మారే వారు లేదా తక్కువ కాలం పనిచేసే వారికి గ్రాట్యుటీ లభించకపోవడం పెద్ద సమస్యగా ఉండేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం, ఒక ఏడాది పూర్తి చేసిన తర్వాత ఉద్యోగి పనిచేసిన కాలానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో గ్రాట్యుటీ పొందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాతపూర్వక ఒప్పందంతో పని చేసే ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. అయితే శాశ్వత ఉద్యోగులకు మాత్రం పాత నిబంధనలే కొనసాగుతాయి. వారికి ఐదేళ్ల సేవ తప్పనిసరి. అయితే ఉద్యోగి మరణించినా లేదా ప్రమాదవశాత్తూ వైకల్యం కలిగినా ఈ ఐదేళ్ల నిబంధన వర్తించదు. ఈ కొత్త చట్టం నవంబర్ 21, 2025 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా 10 మందికి పైగా ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థ ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో లక్షలాది మంది కార్మికులకు ఆర్థిక భద్రత మరింత పెరగనుంది.


గ్రాట్యుటీ లెక్కింపు విధానంలో కూడా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటి వరకు కేవలం బేసిక్ పే ఆధారంగా లెక్కించే గ్రాట్యుటీని, ఇకపై మూల వేతనం, కరువు భత్యం, రిటైనింగ్ అలవెన్స్‌లతో కలిపి లెక్కించనున్నారు. అలాగే ఉద్యోగి మొత్తం వేతనంలో కనీసం 50 శాతం ఈ భాగాలే ఉండాలని నిబంధన విధించారు. దీంతో ముందుగా తక్కువ బేసిక్ పే, ఎక్కువ అలవెన్సులు పొందిన ఉద్యోగులకు ఇప్పుడు ఎక్కువ మొత్తంలో గ్రాట్యుటీ లభించే అవకాశం ఉంది. మొత్తంగా ఈ మార్పులు కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో కీలక మలుపుగా మారనున్నాయి. తక్కువ కాలం పని చేసినా ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశంతో ఉద్యోగులలో నూతన ఉత్సాహం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# జియో ప్లాన్‌కు షాక్

హైదరాబాద్, మన గళం : ఐపీఎల్ సీజన్ ఉత్సాహంగా సాగుతున్న సమయంలో టెలికాం రంగంలో ప్రముఖ సంస్థ రిలయన్స్ జియో వినియోగదారులకు ఊహించని షాక్ ఇచ్చింది. క్రికెట్ అభిమానుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్న రూ.195 డేటా ప్లాన్ వ్యాలిడిటీలో కీలక మార్పులు చేస్తూ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఈ ప్లాన్ 90 రోజుల పాటు అందుబాటులో ఉండేది. అయితే తాజా మార్పులతో దీని గడువును కేవలం 30 రోజులకు మాత్రమే పరిమితం చేశారు. దీంతో తక్కువ ధరలో ఎక్కువ రోజుల పాటు డేటా వినియోగించుకునే అవకాశాన్ని ఆశించిన వినియోగదారులు నిరాశ చెందుతున్నారు. ముఖ్యంగా ఐపీఎల్ మొత్తం సీజన్‌ను ఒకే రీఛార్జ్‌తో చూడాలనుకున్న వారికి ఇది భారంగా మారింది. అయితే వ్యాలిడిటీ తగ్గించినప్పటికీ, ప్లాన్‌లోని ఇతర ప్రయోజనాల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ ప్యాక్ ద్వారా యూజర్లకు 15 జీబీ హై-స్పీడ్ డేటా లభించనుంది. అలాగే మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించేందుకు జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ సౌకర్యం కొనసాగుతుంది. అదనంగా జియో టీవీ, జియో సినిమా వంటి యాప్స్ వినియోగించే అవకాశమూ యథావిధిగా ఉంటుంది.

ఈ నిర్ణయం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. గతంలో ఒకసారి రీఛార్జ్ చేసుకుంటే మొత్తం టోర్నీ కవర్ అయ్యేదని, ఇప్పుడు ప్రతి నెలా రీఛార్జ్ చేయాల్సి రావడం వల్ల ఖర్చు పెరుగుతుందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ వంటి మెగా ఈవెంట్ జరుగుతున్న సమయంలో ఈ మార్పు చేయడం కంపెనీపై విమర్శలకు దారితీస్తోంది. అయినప్పటికీ, డేటా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వ్యాపార పరమైన నిర్ణయంగా ఈ మార్పు తీసుకుని ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. మొత్తానికి, ఈ తాజా నిర్ణయం వల్ల జియో వినియోగదారులు ఇకపై ఎక్కువసార్లు రీఛార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడగా, ఐపీఎల్ సీజన్‌లో వారి ఖర్చులు పెరిగే అవకాశముంది.

# మరణాన్ని గెలిచిన మహాదేవుడు



మన గళం డెస్క్ : క్రైస్తవ సోదరులకు అత్యంత ముఖ్యమైన మరియు పవిత్రమైన పర్వదినం 'ఈస్టర్ సండే'ను రేపు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకోనున్నారు. యేసుక్రీస్తు సిలువపై మరణించిన మూడవ రోజున తిరిగి లేచిన (పునరుత్థానం) సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, మరణంపై జీవం సాధించిన విజయానికి మరియు మానవాళికి లభించిన నిరీక్షణకు సంకేతం. క్రైస్తవ క్యాలెండర్‌లో గుడ్ ఫ్రైడే తర్వాత వచ్చే ఆదివారాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. ఈ రోజును పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న చర్చిలన్నీ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఈస్టర్ పండుగ వెనుక ఉన్న ఆధ్యాత్మిక అర్థం ఎంతో లోతైనది. మానవాళి పాప పరిహారం కోసం యేసుక్రీస్తు సిలువపై తన ప్రాణాలను అర్పించి, సమాధి చేయబడిన తర్వాత తిరిగి సజీవుడై లేచారని బైబిల్ గ్రంథం చెబుతోంది. ఈ పునరుత్థానం అనేది క్రైస్తవ విశ్వాసానికి పునాది వంటిది. యేసు పునరాగమనం ద్వారా మరణం అంతిమ ముగింపు కాదని, నిత్యజీవం సాధ్యమని భక్తులు నమ్ముతారు. అందుకే ఈ రోజును 'హ్యాపీ ఈస్టర్' అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, లోక రక్షకుని రాకను కొనియాడుతూ ప్రార్థనల్లో మునిగిపోతారు. విశ్వాసులందరికీ ఇది ఒక నూతన ఆరంభానికి మరియు దైవిక ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుంది.

ఈస్టర్ వేడుకల్లో భాగంగా చర్చిలను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. తెల్లవారుజామునే 'సన్‌రైజ్ సర్వీస్' పేరుతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. భక్తులు నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు చేరుకుని, ప్రత్యేక కీర్తనలు పాడుతూ ప్రభువును ఆరాధిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఈస్టర్ ఎగ్స్ పంపిణీ చేయడం ఒక ముఖ్యమైన సంప్రదాయం. గుడ్డు అనేది నూతన జీవానికి ప్రతీకగా భావిస్తారు కాబట్టి, రంగులు అద్దిన గుడ్లను పిల్లలకు పంచుతూ ఆనందాన్ని పంచుకుంటారు. అలాగే ఈస్టర్ బన్నీ కూడా ఈ వేడుకల్లో భాగంగా కనిపిస్తుంది. ఈ సంప్రదాయాలు పండుగకు మరింత రంగును, ఉత్సాహాన్ని జోడిస్తాయి.

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో ఈస్టర్ సందడి ఇప్పటికే మొదలైంది. చర్చిల వద్ద భారీ ఏర్పాట్లు చేయడమే కాకుండా, పేదలకు అన్నదానాలు మరియు వస్త్రదానాలు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయి. కుటుంబ సభ్యులందరూ కలిసి విందు భోజనాలు చేస్తూ, ప్రేమ మరియు ఐక్యతను చాటుకుంటారు. ముఖ్యంగా నగరంలోని చారిత్రాత్మక చర్చిలలో రాత్రి వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు మరియు క్రీస్తు జీవిత విశేషాలను తెలిపే నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది భక్తితో పాటు సామాజిక అనుబంధాలను బలపరిచే వేడుకగా నిలుస్తోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు కూడా చేశారు. ఈస్టర్ పండుగకు ముందు నలభై రోజుల పాటు క్రైస్తవులు 'లెంట్' కాలాన్ని పాటిస్తారు. ఈ సమయంలో ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్థనలు మరియు పశ్చాత్తాపంతో ఆధ్యాత్మికంగా తమను తాము సిద్ధం చేసుకుంటారు. ఈ నలభై రోజుల దీక్ష ఈస్టర్ ఆదివారంతో ముగుస్తుంది. యేసుక్రీస్తు అనుభవించిన శ్రమలను స్మరించుకుంటూ, తమ జీవితాల్లో మార్పు కోరుకునే భక్తులకు ఈ రోజు ఒక గొప్ప ఉపశమనాన్ని ఇస్తుంది. మరణాన్ని జయించి తిరిగి లేచిన క్రీస్తు సందేశం ప్రతి ఒక్కరిలో ధైర్యాన్ని మరియు ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. ఈ క్రతువులన్నీ క్రైస్తవ ధర్మంలోని క్రమశిక్షణను మరియు భక్తిని ప్రతిబింబిస్తాయి.

ఆధునిక కాలంలో ఈస్టర్ వేడుకలు కేవలం మతపరమైన అంశాలకే పరిమితం కాకుండా సామాజిక ఐక్యతకు వేదికగా మారుతున్నాయి. వివిధ మతాలకు చెందిన వారు కూడా క్రైస్తవ మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ ఆనందంలో పాలుపంచుకుంటున్నారు. శాంతి మరియు సహజీవనం అనే సందేశాన్ని ఈ పండుగ చాటి చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, యుద్ధాల మధ్య ఈస్టర్ ఇచ్చే ప్రేమ సందేశం ఎంతో అవసరమని ఆధ్యాత్మిక గురువులు ఉద్ఘాటిస్తున్నారు. ద్వేషాన్ని వీడి ప్రేమతో ఎదుటివారిని క్షమించడమే ఈ పండుగ ఇచ్చే గొప్ప పాఠం. ఇది సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడానికి తోడ్పడుతుంది. ప్రభుత్వాలు కూడా ఈ పండుగ ప్రాముఖ్యతను గుర్తించి తగిన సౌకర్యాలను కల్పిస్తున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో చర్చిల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రాజకీయ నాయకులు, ప్రముఖులు క్రైస్తవ సమాజానికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. క్రీస్తు బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఆయన చూపిన కరుణా మార్గం అందరికీ ఆదర్శమని కొనియాడుతున్నారు. ఈ పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తి భావంతో జరగాలని అందరూ కోరుకుంటున్నారు. ఈస్టర్ పండుగ సమాజానికి శాంతి, ప్రేమ మరియు క్షమాగుణాన్ని బోధిస్తుంది. క్రీస్తు చూపిన మార్గంలో నడుస్తూ ఇతరులకు సహాయం చేయడమే ఈ పండుగ యొక్క అసలు ఉద్దేశ్యం. చీకటి తర్వాత వెలుగు ఎలాగైతే వస్తుందో, అలాగే కష్టాల తర్వాత సుఖాలు వస్తాయనే ధైర్యాన్ని ఈ పునరుత్థాన దినం మనకు కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజలు ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని లోక కల్యాణం కోసం ప్రార్థనలు చేస్తారు. ఈస్టర్ ఇచ్చే స్ఫూర్తితో ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలని, సమాజం సుభిక్షంగా ఉండాలని మనసారా ఆకాంక్షిద్దాం. ఈ పండుగ ప్రతి గుండెలో వెలుగులు నింపాలని కోరుకుందాం.




# మొలకలు తింటున్నారా?

**- ముడిగా తినడం కంటే ఇలా తింటేనే సురక్షితం! - బ్యాక్టీరియా ముప్పు మరియు ఇన్ఫెక్షన్ల ప్రమాదం**

మన గళం, ఆరోగ్యం : ఆరోగ్యకరమైన జీవనశైలిని కోరుకునే వారు తమ ఆహారంలో మొలకలను (స్ప్రౌట్స్) తప్పనిసరిగా చేర్చుకుంటారు. సలాడ్లు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో వీటిని ముడిగా తీసుకోవడమే అత్యంత శ్రేయస్కరమని చాలా మంది భావిస్తుంటారు. అయితే, మొలకలను పచ్చిగా తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాల కంటే కొన్ని సందర్భాల్లో ముప్పులే ఎక్కువగా ఉన్నాయని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొలకలు పెరగడానికి అవసరమైన వేడి, తేమతో కూడిన వాతావరణం హానికరమైన ఈ.కోలి, సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియా వృద్ధికి కూడా అనుకూలంగా ఉంటుంది. కేవలం నీటితో కడగడం వల్ల ఈ బ్యాక్టీరియా పూర్తిగా తొలగిపోదు, కాబట్టి వీటిని ఆవిరి పట్టించడం లేదా తేలికగా వేయించి తీసుకోవడం సురక్షితం.

చాలా మంది మొలకలను ప్రోటీన్‌కు ప్రధాన వనరుగా భావిస్తారు, కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. 100 గ్రాముల మొలకలలో కేవలం 3 నుండి 4 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది, ఇది శరీర అవసరాలకు సరిపోదు. ఇతర ప్రోటీన్ వనరులతో పోలిస్తే ఇది చాలా తక్కువ పరిమాణం. అందుకే మొలకలను ప్రధాన ఆహారంగా కాకుండా, ఒక ఉపాహారంగా ) మాత్రమే పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు. శరీరానికి కావాల్సిన సరైన ప్రోటీన్ కోసం పప్పులు, పనీర్, గుడ్లు, టోఫు మరియు శనగలు వంటి ఇతర బలవర్ధకమైన ఆహారాలను తీసుకోవడం ఎంతో అవసరం. కేవలం మొలకలపైనే ఆధారపడటం వల్ల ప్రోటీన్ లోపం ఏర్పడే అవకాశం ఉంది. ముడి మొలకలు జీర్ణక్రియపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు. వీటిలో ఫైబర్ మరియు ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండటం వల్ల, సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారికి ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా ఐబీఎస్ వంటి సమస్యలతో బాధపడేవారికి పచ్చి మొలకలు తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ మరియు కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. మొలకలను కొద్దిగా వండటం వల్ల వాటిలోని క్లిష్టమైన కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నమై, సులభంగా జీర్ణమవుతాయి. తద్వారా శరీరానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోషకాలు అందుతాయి.

మొలకలను నిల్వ చేసే విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీటిని ఫ్రిజ్‌లో ఉంచినప్పటికీ బ్యాక్టీరియా పెరుగుదల పూర్తిగా ఆగదు, కేవలం నెమ్మదిస్తుంది. అందుకే మొలకలను తయారు చేసిన 24 నుండి 48 గంటల లోపు ఉపయోగించడం అత్యుత్తమం. అంతకంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే అవి చెడిపోయి విషతుల్యంగా మారే ప్రమాదం ఉంది. మొలకలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, వాటిని ఎలా తింటామన్నదే ముఖ్యం. సురక్షితమైన పద్ధతిలో వాటిని వండుకుని తినడం ద్వారా ఇన్ఫెక్షన్ల బారి నుండి తప్పించుకోవడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునే క్రమంలో భద్రతా ప్రమాణాలను విస్మరించకూడదు. ముడి మొలకల కంటే ఆవిరిపై ఉడికించిన మొలకలు శరీరానికి ఎక్కువ మేలు చేస్తాయి. చిన్న పిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులు ముఖ్యంగా పచ్చి మొలకలకు దూరంగా ఉండటం మంచిది. మనం తీసుకునే ఆహారం శరీరానికి శక్తిని ఇవ్వాలి కానీ సమస్యలను తీసుకురాకూడదు. కాబట్టి, నిపుణుల సూచనల మేరకు మొలకలను సరైన పద్ధతిలో మీ డైట్‌లో భాగం చేసుకోండి. తద్వారా మీరు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా మొలకల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో ఆస్వాదించవచ్చు.

# పాదాలు కడగడం నిద్రలేమికి పరిష్కారం

**- నిద్రలేమి నివారణ మరియు గాఢ నిద్ర - పాదాల ఆరోగ్యం మరియు ఇన్ఫెక్షన్ల నియంత్రణ**



మన గళం, ఆరోగ్యం : సాధారణంగా మనం ముఖ సౌందర్యానికి ఇచ్చే ప్రాధాన్యత పాదాలకు ఇవ్వం. కానీ రోజంతా మన శరీర బరువును మోస్తూ మనల్ని నడిపించే పాదాల సంరక్షణ కేవలం అందానికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రం చేసుకోవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేదంతో పాటు ఆధునిక వైద్య శాస్త్రం కూడా ధృవీకరిస్తోంది. గోరువెచ్చని నీటితో పాదాలను కడుక్కోవడం వల్ల పాదాలలోని రక్తనాళాలు విశ్రాంతి పొంది, శరీర ఉష్ణోగ్రత సమతుల్యం అవుతుంది. ఇది మెదడుకు ప్రశాంతతను చేకూర్చి, నిద్రలేమి సమస్యను దూరం చేస్తుంది.

మన పాదాలలో వందలాది నరాల కొనలు ఉంటాయి. రోజంతా పని ఒత్తిడితో అలసిపోయినప్పుడు, పాదాలను కడగడం వల్ల ఆ నరాలన్నీ ఉత్తేజితమై కండరాలు తక్షణమే విశ్రాంతి పొందుతాయి. ఇది శరీరంలో ఒత్తిడి కలిగించే హార్మోన్లను తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది ఇంట్లోనే చేసుకునే చిన్నపాటి 'హోమ్ థెరపీ'లా పనిచేస్తుంది. చాలా మందికి రాత్రి వేళల్లో పాదాల మంటలు వేధిస్తుంటాయి; అలాంటి వారు చల్లటి నీటితో పాదాలను శుభ్రం చేసుకోవడం వల్ల శరీరంలోని అధిక వేడి తగ్గి హాయిగా అనిపిస్తుంది. ఇది కండరాల నొప్పుల నుండి కూడా తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్యంతో పాటు పాదాల శుభ్రత కూడా ఎంతో ముఖ్యం. రోజంతా బూట్లు, చెప్పులు వేసుకోవడం వల్ల పాదాలపై బ్యాక్టీరియా మరియు చెమట పేరుకుపోతాయి. దీనివల్ల పాదాల నుండి దుర్వాసన రావడమే కాకుండా చర్మ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. రాత్రి పూట పాదాలు కడగడం వల్ల చర్మానికి గాలి ఆడుతుంది, తద్వారా మడమల పగుళ్లు నివారించబడి పాదాలు మృదువుగా మారుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడటం వల్ల ఉదయం నిద్రలేవగానే కాళ్లు చాలా తేలికగా అనిపిస్తాయి. ఇది చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.

పాదాలను కడుక్కున్న తర్వాత కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చు. పాదాలు కడిగిన వెంటనే పొడి గుడ్డతో పూర్తిగా తుడుచుకోవాలి; తేమ ఉంటే వేళ్ల మధ్య ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. వీలైతే పడుకునే ముందు కొద్దిగా కొబ్బరి నూనె లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలకు మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మరింత మెరుగుపడుతుంది. హాయిగా ఉండాలనుకునే వారు గోరువెచ్చని నీటిని, శరీర వేడి తగ్గించుకోవాలనుకునే వారు చల్లటి నీటిని ఉపయోగించడం ఉత్తమం. ఈ చిన్న మార్పు మీ జీవనశైలిలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. రాత్రిపూట పాదాలను కడుక్కోవడం అనేది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, అది సంపూర్ణ ఆరోగ్యానికి ఒక రహదారి. ప్రతిరోజూ పడుకునే ముందు ఐదు నిమిషాల సమయాన్ని పాదాల కోసం కేటాయించడం వల్ల పీడకలలు రాకుండా గాఢమైన నిద్ర పడుతుంది. ఒత్తిడితో కూడిన నేటి జీవనశైలిలో ప్రశాంతమైన మనసు కోసం ఇదొక సులభమైన మార్గం. సహజ సిద్ధంగా లభించే ఈ చిన్న చిట్కాలను పాటించడం ద్వారా అటు ఆరోగ్యాన్ని, ఇటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి, నేటి నుండే ఈ ఆరోగ్యకరమైన అలవాటును మీ దైనందిన జీవితంలో భాగం చేసుకోండి.

# చిన్నాన్న అలకలు.. పెద్దాన్న కోపాలు

మన గళం, ఆరోగ్యం :ప్రస్తుత కాలంలో ఉరుకుల పరుగుల జీవితం వల్ల దంపతుల మధ్య ఆత్మీయత తగ్గుతోంది. చిన్న చిన్న కారణాలకే అపార్థాలు, కోపాలు పెరిగిపోయి, నూరేళ్లు కలిసి ఉండాల్సిన వారు అర్థాంతరంగా విడిపోతున్నారు. వైవాహిక బంధం అంటే కేవలం కలిసి ఉండటం మాత్రమే కాదు, ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవడం మరియు కష్టసుఖాల్లో తోడుగా నిలబడటం. ఈ బంధాన్ని మరింత దృఢంగా మార్చుకోవడానికి నిపుణులు కొన్ని ఆసక్తికరమైన సూచనలు చేస్తున్నారు. కేవలం బాధ్యతలే కాకుండా, కాస్త సరదాను కూడా జోడిస్తే దాంపత్య జీవితం ఎంతో మధురంగా మారుతుంది. ప్రేమను వ్యక్తపరచడంలో 'ఐ లవ్యూ' అనే మాటకి ప్రత్యేక స్థానం ఉంది. పెళ్లయ్యాక ఇలాంటి మాటలు అవసరం లేదని చాలామంది భావిస్తారు, కానీ అప్పుడప్పుడూ విభిన్న రీతుల్లో ప్రేమను వ్యక్తపరచడం వల్ల భాగస్వామికి మీపై ఉన్న నమ్మకం పెరుగుతుంది. ముఖ్యంగా పుట్టినరోజులు, పెళ్లిరోజుల వంటి ప్రత్యేక సందర్భాల్లో సర్ ప్రైజ్ కానుకలు ఇస్తూ ప్రేమగా మాట్లాడటం వల్ల ఆ క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఇది కేవలం ఒక మాట మాత్రమే కాదు, మీ భాగస్వామి పట్ల మీకు ఉన్న అంకితభావాన్ని చాటిచెబుతుంది.

# పిల్లల్లో పోషకాహార లోపం



- ఈ లక్షణాలను గుర్తించి జాగ్రత్త పడండి!
- మానసిక ఆరోగ్యం మరియు ప్రొటీన్ల ప్రాధాన్యత

మన గళం, ఆరోగ్యం: పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతూ, ఎత్తుకు తగ్గ బరువు ఉండాలంటే వారికి సమతుల్యమైన పోషకాహారం అందించడం ఎంతో అవసరం. ఎదిగే వయసులో పిల్లలు తరచూ అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే తల్లిదండ్రులు వారి ఆహారపు అలవాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లల్లో కనిపించే కొన్ని శారీరక, మానసిక మార్పుల ద్వారా వారిలో పోషకాహార లోపం ఉందో లేదో గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రొటీన్ల లోపం వల్ల మెదడు పనితీరు ప్రభావితమై, పిల్లల్లో ఆందోళన మరియు కుంగుబాటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి వారి ఆహారంలో ప్రొటీన్లు తగినంతగా ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా పిల్లలు ఎంతో హుషారుగా ఉంటారు, కానీ కొందరు ఆహారం తీసుకోవడానికి అంతగా ఆసక్తి చూపరు. ఇలాంటి వారిలో జీర్ణక్రియ సమస్యలు ఉండవచ్చని, శరీరం పోషకాలను సరిగ్గా గ్రహించలేకపోవడమే దీనికి ప్రధాన కారణమని నిపుణులు వివరిస్తున్నారు. జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్ మరియు కృత్రిమ రంగులు ఉన్న ఆహార పదార్థాల వల్ల ఈ సమస్యలు వస్తాయి. వీటిని నివారించడానికి పిల్లలకు పెరుగు, మజ్జిగ మరియు బొప్పాయి వంటి సహజ సిద్ధమైన ఆహారాలను అందించడం ఉత్తమం. దీనివల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి.

రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు తరచూ ఫ్లూ మరియు ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారు. పోషకాహార లోపం వల్ల అనారోగ్యం నుండి కోలుకోవడానికి కూడా వీరికి ఎక్కువ సమయం పడుతుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. బయటి ఆహారానికి దూరంగా ఉంచి, ఇంట్లో వండిన పోషక విలువలు గల ఆహారాన్ని అందించడం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచవచ్చు. అలాగే, ఆహారంలో సరైన పోషకాలు లభించనప్పుడు పిల్లలు ఏదో ఒకటి తినాలనే తపనతో అతిగా ఆహారం తీసుకుంటారు. దీనివల్ల చిన్న వయసులోనే ఊబకాయం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. పిల్లల ఎముకల పుష్టికి విటమిన్ డి మరియు క్యాల్షియం అత్యంత కీలకమైనవి. ఇవి సరిపడా అందకపోతే కండరాల నొప్పులు రావడం, ఎముకలు బలహీనపడటం మరియు చిన్న పనికే నీరసించిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విటమిన్ డి కేవలం ఆహారం ద్వారానే కాకుండా, సూర్యరశ్మి ద్వారా కూడా పుష్కలంగా లభిస్తుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య కనీసం 15 నుండి 30 నిమిషాల పాటు ఎండలో ఉండటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్ డి అందుతుంది. ఇది ఎదిగే పిల్లలకు ఎంతో అవసరమని జాతీయ వైద్య సంస్థలు సూచిస్తున్నాయి. పిల్లల ఎదుగుదలలో పోషకాహారం పోషించే పాత్ర అపారం. పైన పేర్కొన్న లక్షణాలను గమనించి, అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ఇక్కడ అందించిన సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమేనని, ఆరోగ్యపరమైన నిర్ణయాలు తీసుకునే ముందు వ్యక్తిగత వైద్యుల సలహాలు పాటించడం శ్రేయస్కరమని నిపుణులు తెలియజేస్తున్నారు. సరైన పోషకాహారం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలితోనే పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా మార్చవచ్చు. నేటి నుండే మీ పిల్లల ఆహారపట్టికలో అవసరమైన మార్పులు చేసుకోండి.

# పరగడుపున ఉసిరి-జీలకర్ర నీరు అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు

మన గళం, ఆరోగ్యం : ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరికీ ఒక సవాలుగా మారింది. అయితే మన వంటగదిలో లభించే సహజ సిద్ధమైన పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఉసిరి మరియు జీలకర్ర కలిపిన నీటిని సేవించడం వల్ల శరీరానికి ఊహించని రీతిలో మేలు జరుగుతుంది. ఉసిరిలో ఉండే విటమిన్ సి శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, ఇన్ఫెక్షన్ల బారి నుండి మనల్ని కాపాడుతుంది. జీలకర్ర జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ అద్భుత పానీయం తయారీ కోసం ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా జీలకర్రను రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఆ నీటిని బాగా మరిగించి, అందులో కొంచెం తాజా ఉసిరి రసం లేదా ఉసిరి పొడిని కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అంతేకాకుండా, ఇది కాలేయ పనితీరును మెరుగుపరిచి శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపిస్తుంది. తద్వారా రక్తం శుద్ధి జరిగి అంతర్గత అవయవాలు మెరుగ్గా పనిచేస్తాయి. జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఈ డ్రింక్ ఒక వరం లాంటిదని చెప్పవచ్చు. జీలకర్రలోని ఎంజైములు గ్యాస్, ఎసిడిటీ మరియు మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తాయి. అదేవిధంగా, శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, అనవసరమైన కొవ్వును కరిగించడంలో ఇది తోడ్పడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు తమ రోజువారీ దైనందిన జీవితంలో ఈ డిటాక్స్ డ్రింక్‌ను భాగం చేసుకోవడం వల్ల వేగంగా ఫలితాలను పొందవచ్చు. సహజ సిద్ధమైన మార్గంలో ఊబకాయం తగ్గించుకోవడానికి ఇది అత్యంత సులువైన మార్గం. కేవలం అంతర్గత ఆరోగ్యం మాత్రమే కాకుండా, బాహ్య సౌందర్యాన్ని పెంపొందించడంలో కూడా ఉసిరి-జీలకర్ర నీరు అద్భుతంగా పనిచేస్తుంది.

ఆదివారం
05 - 04 - 2026
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# 'కాంగ్రెస్'...
# ...'ప్రగతి రథ సారథి'..'క్రాంతి'

తరువాయి భాగం























వైపు తన ద్రుష్టిని సారించి, ఆ రంగాన కాలు మోపి, అనతి కాలంలోనే రాణించగలిగారు. 2009 నుంచి కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడిగా కొనసాగిన ఆయన 2019 నాటికి క్రియాశీలక రాజకీయాల్లో తనదైన ముద్ర వేయగలిగారు. .2019 సార్వత్రిక ఎన్నికల్లో పత్తికొండ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచి, అటు అధికార,ప్రతిపక్ష పార్టీల నుంచి హేమా హేమీలైన అభ్యర్థులు...అంటే అంగబలం, ఆర్థిక బలం ఉన్న వారిని ఢీకొని, తన సత్తా చాటారు.

పదవులకే..వన్నె తెచ్చిన..యువనేత : తనలోని పోరాట పటిమ, పార్టీ పటిష్టతకు, బలోపేతానికి చిత్తశుద్ధి,అంకితభావాలతో తాను వ్యవహరిస్తున్న తీరు అధిష్టానం మెప్పు పొందింది. ఈ క్రమంలో తనకు కాంగ్రెస్ పార్టీలో ఎ(న్నె)న్నో పదువులు ఎదురొచ్చి,స్వాగతించాయి. అయితే తాను పదవులొచ్చాయి కదా అని మిన్నకుండిపోలేదు. మరింత సమర్థవంతంగా పని చేస్తూ పార్టీ కోసం అహర్నిశలు ముందుకు సాగాడు. ఈ క్రమంలో తనకు జిల్లా జనరల్ సెక్రెటరిగా, యూత్ కాంగ్రెస్ స్టేట్ ఛైర్మన్ గా ,పిసిసి,ఏఐసిసి మెంబర్గా పని చేశారు. తాజాగా జనవరి 2026న కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

న్యాయవాదిగానూ...సమర్థుడే : తనకు చట్టాలు,సెక్షన్ల పట్ల చక్కటి అవగాహన ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుడిగా కొనసాగుతూనే మరో పక్క సత్యసాయి జిల్లాలోని బెస్ట్ ఇన్నోవేటివ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ గానూ పని చేస్తున్నారు. అంతే కాదు..న్యాయవాదిగా గత 5 ఏళ్లుగా పని చేస్తున్న ఆయన కేవలం 5 ఏళ్లు అంటే 5 ఏళ్లలోనే ఏ.పి.హైకోర్టు ప్లాటినం మెంబర్ గానూ కాగలిగారంటే న్యాయవాదిగా తన సత్తా ఏంటో ఎవ్వరికైనా ఇట్టే అవగతమవుతుంది. దాదాపుగా ఓ వంద కేసులను ఆయన విజయవంతంగా డీల్ చేసి, బాధితులకు స్వాంతన కల్పించి, వారి పట్ల దేవుడయ్యాడంటే ఎంత మాత్రమూ అతిశయోక్తి కానేరదు.

రుచి-అభిరుచి : తనకు మాంసాహార,శాఖాహారాలు రెండూ మక్కువే. అయితే ప్రత్యేకించి సాత్వికాహారాన్ని తీసుకునేందుకే తాను ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇక అభిరుచుల విషయానికి వస్తే..శారీరక,మానసిక ధ్రుఢత్వానికి ఉదయం వేళల్లో వ్యాయామం చేస్తుంటారు. సామాజిక సేవా కార్యక్రమలు,పార్టీ కోసం తాను ఎక్కువ సమయాన్ని కేటాయిస్తుంటారాయన.

బాధ-ఆనందం : తన బాల్యదశలో తనకే మాత్రం సంబంధమే లేని ఓ వ్యవహారంలో కొందరు తనను నిందించారు. ఆపై మరో సందర్భంలో తనను కులపరంగానూ కొందరు తక్కువ చేసి,చూపారు. దీంతో

తాను తీవ్రంగా కలత చెందారు. ఆపై..తాజాగా కాంగ్రెస్ పార్టీలోనే తనపై కొందరు అనవసరంగా బురద జల్లడం తనను వేధించినా, పార్టీ నష్టపోతోందని బాధపడిన...నిజవాది..ఆయన. ఇక ఆనందించిన సందర్భాలంటే తన వివాహం,సంతానం,కుల పరంగా తమ సామాజిక వర్గానికి కొంత ప్రాధాన్యం అంది రావడం..ఇలాంటి ఘటనలన్నీ...తాను సంతోషించినవే.

సమాజ సేవకుడే కాదు,సామాజికవర్గ..సేవకుడు : తాను కేవలం ఓ సమాజ సేవకుడు మాత్రమే కాదు..తన సామాజిక వర్గానికి సైతం తగిన సేవ చేసిన...ఓ గొప్ప...దార్శనికుడు. తమ సామాజిక వర్గానికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి కేవలం తక్కువ సంఖ్యలో రాజకీయ పదవులందేవి. ఇది తనను ఎంతో బాధించిన నేపథ్యంలో కుల పరంగా పోరాడి, నిలిచి, గెలిచాడాయన. 2024లో 4 ఎమ్మెల్యేలు, 1 ఎమ్పీ, 2 ఎమ్మెల్సీలుగా తన సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశాలు వచ్చేలా ఉద్యమించిన నాయకుడాయన. అంతే కాదు ఎస్టీ రిజర్వేషన్ అంశం ఏకంగా భారత రాష్ట్రపతి దాకా చేరిందంటే...అందులో తన ప్రమేయమెంతో ఉంది. ఇది ఎవ్వరు కాదన్నా...అందరూ అంగీకరించక తప్పని...నిజం.



బెస్ట్ ఫ్రెండ్స్ : హైదరాబాద్ లో ఉండే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ మోయిన్,డాక్టర్ శిరీషలు తనకు ఎంతో హితులు, సన్నిహితులు. అంతే కాకుండా తన క్లాస్మెట్, తన జీవిత సహధర్మచారిణి స్రవంతి సైతం తనకు మంచి స్నేహితురాలే.

న(మె)చ్చిన...నేతలు : జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ,ఇందిరాగాంధీ,రాజీవ్ గాంధీ,రాహుల్ గాంధీలు తాను న(మె)చ్చిన నాయకులు.

యువతకు..సందేశం : యువత స్థిరమైన లక్ష్యాలను నిర్ణయించుకుని, వాటి సాధనకు శ్రమించాలి. విద్యతోనే జీవిత వికాసం సిద్ధిస్తుందనే వాస్తవాన్ని గ్రహించాలి. జీవితాల్లో స్థిరపడిన యువత వీలైనంతలో పదుగురికి సాయపడాలి. సమాజ సేవలో తరించాలి. ముఖ్యంగా రాజకీయాల్లోకి యువత పెద్ద ఎత్తున రావాలని, అప్పుడే స్వచ్ఛ రాజకీయాలన్నవి చేసేందుకు వీలుంటుందంటోన్న తాను..యువతకు..ఓ మార్గదర్శి.

వినూత్నయోచనలకు...ఆద్యుడు : తాను సహజంగానే ఓ మహిళాభ్యుదయవాది. అంతే కాదు...తాను ఓ వ్యవసాయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన క్రమంలో తాను రైతన్నల పక్షాన నిలిచేందుకే ప్రాధన్యమిస్తుంటాడాయన. మహిళలు ఉన్నత విద్యలను అభ్యసించి, ఉద్యోగ,ఉపాధి రంగాల్లో మంచి స్థానాల్లో నిలిస్తేనే, అంటే ఆర్థిక స్వావలంబన సాధిస్తేనే మహిళాభ్యుదయం సిద్ధిస్తుందనే సత్యవాదాయన. పంట దిగుబడి రాలేదనో, గిట్టుబాటు ధరలేదనో ఆవేదనలో కూరుకుపోయి, బలవణ్మరణాలకు పాల్పడి, తమ కుటుంబాలను అనాథలను చేయరాదని అన్నదాతలకు సూచిస్తోన్న తాను...రైతు పక్షపాతి.

**స్వచ్ఛ..రాజకీయవాది :** ప్రస్తుత రాజకీయాలన్నీ పూర్తిగా స్వార్థపూరితమైపోయాయని, ధన రాజకీయాలే నడుస్తున్నాయని, వీటిపై మీ అభిప్రాయమేంటంటే..తాను ఠక్కున ఒక్కటే చెబుతుంటారు. డబ్బు లేకపోయినా రాజకీయాలు చేసే అవకాశాలు ప్రస్తుత ఆధునిక సమాజంలో అంది వచ్చాయని...స్వార్థమన్నది ప్రతి ఒక్కరిలోనూ ఉండేదేనని, అయితే..సొంత లాభం కొంత మానుకుని, పొరుగువారి కోసం పాటుపడాలనే సదాశయంతో ముందుకు సాగితే స్వచ్ఛ రాజకీయాలన్నవి నెరపడం కష్టమేం కాదంటోన్న...స్వచ్ఛ రాజకీయవాదాయన.

**నిరంతర..సేవకుడే :** తాను న్యాయ సలహాల కోసం, లేదా పార్టీ కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటు ఉంటుంటారు. తనను ఎవ్వరైనా తగిన సలహాలు,సూచనల కోసం నేరుగా కర్నూలు నగరంలోని కళా వెంకట్రావ్ భవన్ లో ఎప్పుడైనా కలవచ్చని, అలా వీలు కాని పక్షంలో తన మొబైల్ ఫోన్ నెంబర్ : 99638 20823 లో గానీ సంప్రదించి తగిన చేయూతను పొందవచ్చంటోన్న

**తాను...నిస్సందేహంగా...ఓ...ప్రజాహితైషి.**

**జీవితాశయం : కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో నూతన జవసత్వాలు నింపాలి. పార్టీ అధినేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసే సత్కార్య సాధనలో తాను సైతం...ఓ...భాగస్వామి కావడమే తన జీవితాశయమంటోన్న ఆయన...నిజంగా....పార్టీ అధిష్టానానికి ఓ..వీర విధేయుడే.**










మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక



# 'కాంగ్రెస్'...
# ...'ప్రగతి రథ సారథి'..'క్రాంతి'



- కార్యసాధకుడు క్రాంతి నాయుడు బోయ
- ముక్కుసూటి తనమే తన 'బలం'...'బలహీనతా'...అదే
- పార్టీ పటిష్టతే  తన ధ్యేయం,బలోపేతమే తన లక్ష్యం
- కర్నూలు జిల్లా కాంగ్రెస్ లో అతి 'పి(చి)న్న'...వయస్సు...డిసిసి...అధ్యక్షుడు..తానే



- అతి సాధారణ మధ్య తరగతి కుటుంబాన జన్మించాడు
- వ్యవసాయ,ఉద్యోగ నేపథ్యమున్న ఇంట పెరిగాడు
- తల్లి,దండ్రుల నుంచి నైతిక విలువలు,ఆదర్శ భావాలను వారసత్వంగా  అందుకున్నాడు
- బాల్యం నుంచి స్వతహాగా మంచి చదువరే
- చిన్ననాటి నుంచి తనలో నాయకత్వ లక్షణాలు మెండు
- ఉన్నత విద్యలను అభ్యసించాడు
- ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు
- సమాజ సేవలో తరించాలని ఉద్యోగాన్ని త్యజించాడు
- ప్రజా శ్రేయస్సుకు రాజకీయ అ(తె)రంగేట్రం చేశాడు
- తనలోని పోరాట పటిమ అధిష్టానాన్ని ఆకర్షించింది
- పదవులు ఎదురొచ్చి,స్వాగతించాయి
- చిత్తశుద్ధి,అంకితభావాలతో పని చేస్తూ, ఆ పదవులకే వన్నె తెచ్చేలా వ్యవహరించాడు
- తన వ్యవహారశైలి ఏకంగా అధ్యక్ష పదవి అంది వచ్చేలా చేసింది
- కుటిల రాజకీయాలు వే(బా)ధించాయి
- అయినా వెరువని,వెనుకంజేయని...ధీశాలి
- రాజకీయాల్లో రాణించి,స్వచ్ఛ రాజకీయాలు నెరపాలని యువతకు సూచిస్తున్న మార్గదర్శి
- ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారాలు కానేరవంటోన్న మహిళాభ్యుదయవాది, రైతు పక్షపాతి
- పార్టీలో నూతన జవసత్వాలు నింపడమే జీవితాశయమంటోన్నవీర విధేయుడు

**(...నిజవాది, నిరాడంబరుడు, యువనేత ..కర్నూలు డి.సి.సి.అధ్యక్షుడు క్రాంతినాయుడు బోయ.. జీవిత విజయ ప్రస్థానమిది...)**










(మన గళం,కర్నూలు పాతబస్తీ) : "...రూ.వేల వేతనం పొందుతోన్న తాను సమాజ సేవకు ఆ ఉద్యోగాన్ని త్యజించి, ముందుకు సాగిన నేపథ్యంలో..అనతి కాలంలోనే తనకో మంచి, చక్కటి గుర్తింపు లభించింది. అదే..కొందరు, అనేకన్నా పలువురు రాజకీయ నేతలకు కంటగింపుగా మారింది. అయినా వారి వే(బా)ధింపులకు వెరువక ముందుకు సాగుతున్న క్రమంలో జరిగిన సుధీర్ఘ అంతర్మథనమే...తన రాజకీయ అ(తె)రంగేట్రానికి తెర తీసింది..."

"..నీతిని నమ్ముకున్న వాడు ఎవ్వరి చెప్పుడు మాటలకు లొంగడు, నిజాయితీని నమ్ముకున్న వాడు..ఎవ్వరి చెప్పుచేతల్లో ఉండడు...ఈ సూక్తి..తననెంతో ఆకర్షించింది. మరెంతగనో...ఆలోచింపజేసింది. తమ పార్టీ అధినేత నిరంతరం సూచించే, ఆచరించే ఆ సూక్తిని...తాను త్రికరణశుద్ధిగా విశ్వసించాడు..ఆచరణలోనూ...అంతే చిత్తశుద్ధి,అంకితభావాలతో ముందుకు సాగాడు...ఫలితమే...జిల్లాలో అంతటి పి(చి)న్న వయస్సులోనే ఏకంగా ఆ జాతీయ పార్టీకి అధ్యక్షుడు కాగలిగాడాయన.."

(యస్.బి.నందకిషోర్,సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ నెంబర్స్ : 80087 88416, 94404 40529)

"...ఎందరెందరో మహామహులు బరిలో ఉండగా తాను పార్టీ కోసం చేసిన సేవలను, తన వయస్సును గుర్తించి అధిష్టానం తనను అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. ఈ క్రమంలో కలిసి వచ్చే వారిని కలుపుకుని, పార్టీ కోసం పని చేస్తానని, అయితే..ఇదే క్రమంలో కుటిల రాజకీయాలు చేయాలని చూసేవారెంతటి వారైనా, వారెవ్వరైనా...ఉపేక్షించబోనని..తాను ముక్కుసూటిగా,సుతిమెత్తగా తన ప్రమాణ స్వీకారోత్సవంలోనే చెప్పకనే,చెప్పి, కొందరు ప్రత్యర్థులను హెచ్చరించారాయన. ఫలితం...తాను తన సొంతానికి పార్టీ నిధులు వాడుకోకపోయినా...తనపై విమర్శల వర్షం కురిపించి, ఆరోపణలు,ఫిర్యాదులకు దారి తీసి, అధిష్టానం దాకా వెళ్లే దుస్థితిని తీసుకువచ్చాయి. ఈ నేపథ్యంలో తనపై వస్తోన్న అసత్య ఆరోపణలు,అవాకులు,చెవాకులను చూసి, విని, రాజకీయాల్లో ఎందుకొచ్చానా..? అని ఆయన వగచిన సందర్భాలున్నా...కానీ..ప్రత్యర్థుల ఎత్తులకు..మనమే వెనుకడుగేస్తే...ఇక మనమెందుకు..? అని నిత్యం తన తండ్రి చెప్పిన మాటలు తనలో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. ఫలితమే..తానో సత్యవాదినని, పార్టీ నిధులను తాను దుర్వినియోగం చేయలేదని అధిష్టానానికి విన్నవించి, క్లీన్ చిట్ తో మళ్లీ డిసిసిగా ముందుకు సాగుతోన్న ఘన చరిత అసొంతమూ...తన సొంతమే. అంతే కాదు..అంతర్గత రాజకీయాలు తగవని, పార్టీలో నాయకులు,కార్యకర్తలందరూ ఓ కుటుంబంలా ముందుకు సాగుదామంటూ...త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా ముందుకు కదిలి, కర్నూలు జిల్లా డెవలప్ మెంట్ కు, బోయలకు ఎస్టీ రిజర్వేషన్ సాధనకు...శ్రమిద్దామని పార్టీ నాయకులు,కార్యకర్తలకు పిలుపునిస్తోన్న...ధీరోదాత్తుడు..ఆయన..."




స్వగతం :

పూర్తి పేరు : క్రాంతి నాయుడు బోయ

తల్లి,దండ్రులు : భ్రమరాంబ,హనుమంతునాయుడు దంపతులు

స్వస్థలం : కర్నూలు జిల్లా,పత్తికొండ నియోజకవర్గం,దేవనకొండ మండలం,పొట్లపాడు గ్రామం

పుట్టిన తేదీ : 23.08.1991.

కుటుంబ నేపథ్యం : అతి సాధారణ మధ్య తరగతి కుటుంబం వారిది. వ్యవసాయ నేపథ్యమూ ఉంది. తన తాతకు 3 ఎకరాల వ్యవసాయ భూముండేది. వారింట తన తండ్రి ఉన్నత చదువులను చదివారు. వారిది ఉద్యోగ నేపథ్యమూ ఉన్న కుటుంబమే. తన తల్లి,దండ్రి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేసేవారు. వారు వారి తల్లి,దండ్రులకు ఇద్దరు సంతానం. తన అన్న పేరు విక్రం నాయుడు, తాను వైద్య నిపుణుడిగా కొనసాగుతున్నారు. సంతానంలో తానే చిన్నవాడిగా ఆయన జన్మించాడు.

కుటుంబం : వారికి 2018, ఫిబ్రవరి 23న వివాహమైంది. ఆ దంపతులది పెద్దలు అంగీకరించిన ప్రేమ వివాహం. తన జీవిత సహధర్మచారిణి పేరు స్రవంతి, తాను ప్రభుత్వ ఉద్యోగిణిగా కొనసాగుతున్నారు. ఆ దంపతులకు ఇద్దరు సంతానం. వారి పెద్దబ్బాయి పేరు క్యాథి, తాను 3వ తరగతి చదువుతుండగా, వారి అబ్బాయి పేరు మోక్ష నాయుడు, తాను యుకెజి చదువుతున్నాడు.

విద్యాభ్యాసం : తాను బనవాసిలోని నవోదయ విద్యాలయ లో చదివారు. ఉన్నత చదువులను అంటే ఇంజనీరింగ్ కోర్సును ఎస్.కె.యూనివర్శిటీ నుంచి పూర్తి చేశారు. ఎల్.ఎల్.బి.కోర్సును బెంగుళూరు లోని నేషనల్ లా కాలేజీ నుంచి చదివారు. యం.ఏ. పొలిటికల్ సైన్స్, యం.ఏ.పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులను తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో చేశారు. అంతే కాదు,దేశ రాజధాని ఢిల్లీలోనూ పలు ఇతర కోర్సులను పూర్తి చేశారు. సివిల్స్ పై ఆసక్తితో ఢిల్లీలో కోచింగ్ కూడా తీసుకుని, సెంట్రల్ సర్వీస్ లో 2013 నుంచి 2019 దాకా ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి, ఆనక కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారాయన.

నాయకత్వ లక్షణాలు..మెండు : తాను స్వతహాగా ఆట,పాటల్లోనూ, విద్యార్జనలోనూ చిన్ననాటి నుంచి మంచి ప్రావీణ్యుడే. తరగతి గదుల్లో అన్నింటా ముందుంటూ, అందరిలో తానొకడిగా కాకుండా, అందరిలోనూ కాస్తంత విభిన్నంగా ఉండేందుకు తాను ప్రాధాన్యమిచ్చేవాడు. ఈ నేపథ్యంలో అటు ఉపాధ్యాయులు,అధ్యాపకులు,సహాధ్యాయుల నుంచి ప్రశంసలను,మన్ననలను అందుకుంటూ...యూనివర్శిటీ స్థాయిలో స్టూడెంట్ లీడర్ గా 2010 నుంచి 2012 దాకా పని చేసిన, నాయకత్వ లక్షణాలున్న యువ నేత తాను.

సమాజ సేవకుడు : తాను కేవలం ఆట,పాటల్లోనే కాదు..చిన్ననాటి నుంచి తనలో సామాజిక సేవలో తరించాలనే తపన అధికంగా ఉండేది. ఈ నేపథ్యంలో తాను హెల్ప్స్ అనే స్వచ్ఛంద సంస్థను 2014 లో స్థాపించాడు. ఆ సంస్థ తరపున పలు ఉచిత వైద్య శిబిరాలు,అన్నదాన శిబిరాలు..ఇలా..చెప్పుకుంటూ పోతే..తాను చేసిన సేవా కార్యక్రమాలు ఎ(న్నె)న్నో..అంతేనా..? గ్రామ,గ్రామాల్లో అక్షరాస్యత పెంపుదల కోసం అవగాహనా సదస్సులను నిర్వహించి, సమాజ సేవలోనూ తరించిన గొప్ప సేవాతత్పరుడాయన.

రాజకీయ అ(తె)రంగేట్రం : యువకుడు,ఉన్నత విద్యావంతుడు,స్ఫురద్రూపి,నాయకత్వ లక్షణాలున్న తాను అనతి కాలంలోనే సమాజంలో ఓ ప్రత్యేక గుర్తింపును పొందగలిగాడు. అయితే..అదే..పలువురు సీనియర్ రాజకీయవేత్తలకు, మరి కొందరు అప్ కమింగ్ రాజకీయ వారసులకు కంటగింపుగ మారింది. దీంతో తను పలు రకాలుగా, అంటే వివిధ రకాలుగా పలువురు నేతలు వే(బా)ధించారు. అయినా..తాను వెరువలేదు, వెనుకంజేయనూ లేదు. ఓ విధంగా చెప్పాలంటే వారి వేధింపులే తనను రాజకీయాల వైపు వెళ్లేలా చేసింది. తాను రాజకీయ రంగాన కాలుమోపితే గానీ, సమాజ సేవలో భాగస్వామి కాలేనని గ్రహించిన ఆయన...వెంటనే రాజకీయాల

7లో

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.